ఆంధ్రజ్యోతి

పశ్చిమ గోదావరి

మంగళవారం 15 అక్టోబరు 2024 5



స్పైసీగా..

ఆతిథ్యానికి పెట్టింది పేరు పశ్చిమ. రకరకాల రుచులు గోదావరి జిల్లా సొంతం. ఇప్పుడు రెస్టారెంట్ కల్చర్ పెరిగింది. ఊరూరా హైదరాబాద్ దమ్ బిరియాని సహా వెరైటీ నాన్ వెజ్ రుచులన్నీ ఇక్కడే స్పైసీగా దొరుకుతున్నాయి. వాటిని మీరు ఆస్వాదించండి.. 6లో..



వెయ్యేళ్ల గోపురం

ఈ ఆలయ గోపురం వయసు వెయ్యేళ్లు. అపురూపమైన చిత్ర, శిల్ప కళల సంపదకు సజీవ సాక్ష్యం. ఇసుక, రాతి శిలతో నిర్మితమైన ఈ గాలి గోపురంపై రమణీయ శిల్పాలు నాటి చారిత్రక వైభవానికి నిదర్శనం. ఇది ఎక్కడో తెలుసా ? 6లో..



ఆర్టీసీ బస్ బోల్తా

అది మలుపు.. ఎవరైనా ఏం చేస్తారు ? స్పీడు తగ్గించి స్లోగా వెళతారు. కాని, హైదరాబాద్ నుంచి ఏలూరు వెళుతున్న ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సును డ్రైవర్ స్పీడుగా నడిపాడు. ఒక్కసారిగా బోల్తాపడి కొంత దూరం ఈడ్చుకుపోయింది. ఆ సమయంలో బస్సులో 36 మంది ప్రయాణికులు ఉండగా.. ఒకరు మృతి చెందారు. 17 మంది గాయపడ్డారు. 7లో..



ముగ్గురి ఆత్మహత్య

బైక్ కొనివ్వలేదని యువకుడు, పిల్లలకు పెళ్లిళ్లు కావడం లేదని తల్లి, మద్యం తాగొద్దని తిట్టారని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నారు. 7లో..

బకసంహారం అలంకారంలో శ్రీవారు



ద్వారకాతిరుమల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): బక సంహారం అలంకారంలో చినతిరుమలేశుడు సోమ వారం భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవారి ఆశ్వయుజ మాస దివ్యబ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు ఆలయ ముఖ మండపంలో రోజుకో అలంకారంలో భక్తులను కటాక్షిస్తున్నారు. కొంగ రూపంలో వచ్చిన బకుడనే రాక్షసుడ్ని కడచేర్చే శ్రీకృష్ణునిగా బకసంహారం అలంకారంలో స్వామివారు భక్తులకు కనువిందు చేశారు. ఆలయాన్ని, పరిసరాలను విద్యుద్దీప తోరణాలతో శోభాయమానంగా అలంకరించారు.





తమ్ముళ్లకు చుక్కెదురు

- మద్యం లాటరీ కోలాహలం
- 175 దుకాణాలకు లాటరీ తీసిన జిల్లా కలెక్టర్ నాగరాణి
- దుకాణాలు దక్కించుకున్న 10 మంది మహిళలు
- అత్యధిక షాపులు వైసీపీ సానుభూతిపరులకే
- భీమవరంలో ఓ వర్గం సిండికేట్‌కు చేదు అనుభవం
- తాడేపల్లిగూడెంలో కూటమి సానుభూతి పరులదే పైచేయి
- తెలంగాణ నుంచి మళ్లీ స్థానికంగా పాగా వేసిన వ్యాపారులు





డ్రా తీస్తున్న కలెక్టర్, హాజరైన దరఖాస్తుదారులు

(భీమవరం/భీమవరం క్రైం-ఆంధ్రజ్యోతి)

జిల్లా అధికార యంత్రాంగం మద్యం షాపుల లాటరీ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించింది. పారదర్శకంగా లైసెన్స్‌దారులను లాటరీ ద్వారా ఎంపిక చేసింది. కొందరికి అదృష్టం వరించింది. మరికొందరికి చేదు అనుభవం ఎదురైంది. మహిళలు సైతం మద్యం షాపులకు పోటీ పడ్డారు. గడచిన ఐదేళ్లలో ప్రైవేటు వ్యాపారం లేదు. ప్రభుత్వమే మద్యం షాపులు నిర్వహించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ ప్రైవేటు మద్యం షాపులను ప్రవేశపెట్టడంతో వ్యాపారుల నుంచి గట్టిపోటీ నెలకొంది. స్థానికేతరులకు మద్యం షాపుల్లో అదృష్టం కలసి వచ్చింది. నర్సాపురంలో స్థానికులకు ఎదురుదెబ్బ తగిలింది. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వ్యాపారులు సైతం అక్కడ షాపులను దక్కించుకున్నారు. కూటమి సానుభూతి పరులకు నర్సాపురంలో పెద్దగా షాపులు లభించలేదు. భీమవరంలో కూటమికి చెందిన ఓ వర్గం 150 దరఖాస్తులు సమర్పించింది. అంటే రూ.3.00 కోట్లు చెల్లించింది. వారికి కేవలం 5 షాపులు మాత్రమే లభించాయి. అవికూడా శివారు ప్రాంతాల్లో దక్కాయి. అంటే ఒక్కో షాపుకోసం రూ.60 లక్షలు చెల్లించినట్టయ్యింది. రెండు సంవత్సరాల లాభంలోనే ఆ మొత్తాన్ని భరించాలి. అత్యధికంగా షాపులు వస్తాయని ఆశించిన ఆ వర్గానికి లాటరీలో చుక్కెదురైంది. మద్యం షాపులు గిట్టుబాటు కావంటూ ఇప్పుడు తమ్ముళ్లు మొుల్లు మంటున్నారు. వైసీపీ వర్గీయులకు భీమవరంలో డిమాండ్ ఉన్న షాపులు లభించాయి.



నగదు లెక్కిస్తున్న బ్యాంకు సిబ్బంది

మళ్లీ స్వస్థలానికి

వైసీపీ హయాంలో తెలంగాణ రాష్ట్రానికి వెళ్లిపోయిన వారంతా మళ్లీ ఇప్పుడు స్వస్థలాలకు వచ్చేశారు. తెలంగాణలో షాపులు దక్కించుకున్న తాడేపల్లిగూడెం వ్యాపారులకు ఇప్పుడు స్థానికంగానూ హవా నడిచింది. తాడేపల్లిగూడెంలో ఇద్దరు వ్యాపారుల సిండికేట్‌కు ఇప్పుడు మళ్లీ షాపులు దక్కాయి. తాడేపల్లిగూడెం రూరల్ మండలంలో సిండికేట్ అయిన తెలుగుతమ్ముళ్ల చేతి చమురు వదిలించుకున్నారు. తొలిసారిగా మద్యం వ్యాపారంలోకి వెళ్లారు. వారి సిండికేట్‌కు ఒక్క షాపు లభించలేదు. దాంతో ఒక్కో తెలుగుదేశం నాయకుడు రూ. 10 లక్షలు వంతున నష్టపోయారు. కూటమిలో మరో వర్గానికి మాత్రం కొంత ఊరట లభించింది. పెంటపాడు మండలంలో రెండు షాపుల్లో లైసెన్స్‌లు పొందారు. తాడేపల్లిగూడెంలో కూటమికి చెందిన నాయకుడుకు చెందిన సిండికేట్ కోటి రూపాయలతో 50 దరఖాస్తులు

మిగతా 8వ పేజీలో...

కోలాహలం

జిల్లాలోని 175 ప్రైవేటు మద్యం దుకాణాలకు సోమవారం కలెక్టర్ నాగరాణి, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి కలిసి లాటరీ తీశారు. ఈ లాటరీలో వచ్చిన పేర్లకు దుకాణాలు కేటాయించారు. భీమవరం శివారు పెదఅమిరం గ్రామ పరిధిలోని నిర్మలదేవి ఫంక్షన్ హాల్‌లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఈ ప్రక్రియ కొనసాగింది. ఉదయం నుంచి ఫంక్షన్ హాల్ వద్ద కోలాహలం కనిపించింది. భారీ ఎత్తున కార్లు, మోటార్ సైకిళ్ళు రావడంతో పాటు ఆయా పోలీస్‌స్టేషన్ల నుంచి సుమారు 500 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ముందుగా ఆకివీడు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ నుంచి లాటరీ ప్రారంభమైంది. అనంతరం భీమవరం, నర్సాపురం, పాలకొల్లు, తాడేపల్లి గూడెం, చివరిగా తణుకు పోలీస్ స్టేషన్‌తో ముగించారు. మొత్తం 5627 దరఖాస్తులకు గాను కాయిన్లను డాబ్బాలో వేసి డ్రా తీసి విన్నర్‌కు కేటాయించారు. అలా 175 సార్లు లాటరీ తీశారు. కార్యక్రమంలో ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ కమిషనర్ ప్రభుకుమార్, అడిషనల్ ఎస్పీ భీమారావు, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కుమారేశన్, రంగారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, డీఎస్పీ జయసూర్య పాల్గొన్నారు.



పాలకొల్లు క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయ గోపురంపై కమ్మేసిన మేఘాలు

మళ్లీ ముసురు

- అధికారుల అప్రమత్తం
- నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్

నరసాపురం రూరల్/భీమవరం రూరల్/టౌన్ అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. సోమవారం జిల్లావ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వానలు పడ్డాయి. రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ హెచ్చరికతో రైతుల్లో గుబులు నెలకొంది. ఇప్పటికే రెండుసార్లు తుపాన్లు కారణంగా సార్వాలో నష్టాన్ని చవిచూసిన రైతులు ఈసారి వచ్చే వర్షాలు ఏ నష్టాన్ని మిగులుస్తోందోనన్న భయంతో ఉన్నారు. భారీ వర్షాల హెచ్చరికతో అలర్ట్ అయిన అధికారులు సిబ్బంది సెలవుల్ని రద్దు చేశారు. తీర ప్రాంతంలో పని చేసే ఉద్యోగులంతా స్థానికంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. సముద్ర వేటను నిషేధించారు. వేటకు వెళ్లిన బోట్లను వెనక్కి రప్పిస్తున్నారు. మరోవైపు బలమైన గాలులకు విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని సిబ్బందిని ఈపీడీసీఎల్ అప్రమత్తం చేసింది. ఇందుకు ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. నరసాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో 93911 85874 నెంబర్‌తో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. భీమవరం జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయంలో 94409 02926 (ఎల్‌ఎంసీ ఏలూరు), 94906 10143 (భీమవరం) నెంబర్‌లతో 24 గంటల పాటు మూడు షిఫ్టులలో పనిచేసే విధంగా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు. ప్రత్యేకంగా లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఈప్రాంతాల్లో పని చేసే సిబ్బంది ఎప్పటికప్పుడు సమాచారాన్ని కంట్రోల్ రూమ్‌కు అందించాలని ఆదేశాలు ఇచ్చారు. పెనుగాలులు ఉండే అవకాశం ఉన్నందున ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం లేకుండా తుఫాన్ భవనాలను సిద్ధం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. గత 24గంటల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్లన్నీ అస్తవ్యస్థంగా మారాయి. సముద్ర ంలో కెరటాలు ఎగిసిపడుతున్నాయి. దీంతో మత్స్యకారులు వలలు, బోట్లను సురక్షిత ప్రాంతాలకు తరలించుకుంటున్నారు.



నరసాపురంలో మునిగిన రోడ్లు

తీరానికి బోట్లు

వేట నిషేధం ఆజ్ఞలు అమల్లోకి రావడంతో వేటకు వెళ్లిన బోట్లన్నీ తీరానికి చేరుకుంటున్నాయి. అంతర్వేది లైట్‌హౌస్ ద్వారా బోట్లకు సమాచారాన్ని పంపిస్తున్నారు. తిరిగి ఆదేశాలు వచ్చే వరకు మత్స్యకారులెవ్వరూ వేటకు వెళ్ళవద్దని మత్స్యశాఖ జేడీ ప్రసాద్ కోరారు. మొగల్తూరు రెవెన్యూ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని 9291539408 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

సార్వా సాగుకు ముప్పు

జిల్లాలో లక్షా 95 వేల ఎకరాల్లో సార్వా సాగు సాగింది. దీనిలో లక్ష

మిగతా 8వ పేజీలో...

అర్జీలకు పరిష్కారం చూపాలి : డీఆర్వో



భీమవరం టౌన్, అక్టోబరు 14 : అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కర రావు అన్నారు. సోమవారం కలెక్టరేటులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (మీ కోసం) కార్యక్రమంలో డీఆర్వో జె.ఉదయ భాస్కరరావుతోపాటు జిల్లా గ్రామ వార్డు సచివాలయం అధికారి వై.దోసి రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, డి.ఎం సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ టి.శివరామ ప్రసాద్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులను స్వీకరించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ప్రజలు అందించే వినతులను ఒకటికి రెండుసార్లు క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కరించాలని సూచించారు. అవసరమైతే క్షేత్రస్థాయి పర్యటన చేసి సమస్య తెలుసుకోవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 114 అర్జీలు వచ్చాయి. వాటిలో కొన్ని సమస్యలు ఇలా ఉన్నాయి.

కొడుకు కోడలి వల్ల ఇబ్బందులు

తన స్వార్జితం ఆస్తిని కుమారుడు, కోడలు ఆక్రమించుకుని దౌర్జన్యంగా తమ పేరుపై రాయాలంటూ మానసికంగా శరీరకంగా ఇబ్బందులు గురిచేస్తున్నారని అత్తిలికి చెందిన నమ్మి మహాలక్ష్మి ఫిర్యాదు చేశారు.

మంచినీటి చెరువు కలుషితం

మంచినీటి చెరువుని ఆనుకొని రొయ్యల చెరువు సాగు చేయడం వలన తాగునీరు కలుషితమైందని ఇరగవరం మండలం పొదలాడ గ్రామం నుంచి డి. భాస్కరరావు, డి.కృష్ణ కుమార్, 100 మంది గ్రామస్తులు ఫిర్యాదు చేశారు.

పింఛన్ ఇప్పించండి

ప్రభుత్వం ఇచ్చే 6 వేల రూపాయలు పెన్షన్ మందులు ఖర్చులకు సరిపోవడం లేదు. ప్రభుత్వం అందిస్తున్న రూ.15 వేలు పెన్షన్ మంజూరు చేయాలని ఆకివీడు మండలం దుంపగడప గ్రామానికి చెందిన రావిశెట్టి అన్నపూర్ణ అనే దివ్యాంగురాలు వినతి అందించారు.

నీటి సంఘాలకు ఎన్నికల

నగారా



- రేపు నోటిఫికేషన్ విడుదల
- మూడు విడతలుగా ఎన్నికలు
- వచ్చే నెల 16 నుంచి 18 వరకు నీటి సంఘాలకు.. 19 నుంచి 21 వరకు డిస్ట్రిబ్యూటరీ కమిటీలు.. 22 నుంచి 24 వరకు ప్రాజెక్టు కమిటీ ఎన్నిక
- రేపు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సమావేశం

నరసాపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి):నీటి సంఘాలకు ఎన్నికల నగారా మోగింది. తొమ్మిదేళ్ళ తరువాత మళ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా కమిటీ ఎన్నికలను సమర్థవంతంగా పూర్తిచేసింది. గ్రామస్థాయిలో రైతులకు ఎంతో మేలు జరిగే నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను చేస్తున్నది. దీనికి సంబంధించి ఇప్పటికే ఇరిగేషన్ అధికారులకు ప్రభుత్వం దిశా నిర్దేశం చేస్తూ ఆదేశాలు జారీచేసింది. తాజాగా ఎన్నికలపై బుధవారం పశ్చిమ జిల్లాకు సంబంధించి కలెక్టర్ నాగరాణి ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో సమావేశాన్ని నిర్వహించనున్నారు.

జిల్లాలో 5.50 లక్షల ఎకరాల్లో సాగు

జిల్లాలో మొత్తం 5.50 లక్షల ఎకరాలు సాగులో ఉంది. ప్రధానంగా పంట కాల్వలు 245 కిలో మీటర్ల మేర విస్తరించింది. అనుబంధ కాల్వలు 350 కిలోమీటర్ల మేర ప్రవహిస్తున్నాయి. ఇవి కాకుండా సుమారు 150 కిలోమీటర్ల మేర మేజర్ డ్రెయిన్, 200 కిలోమీటర్ల మేర మైనర్ డ్రెయినేజీలు ఉన్నాయి. నీటిపారుదలకు సంబంధించి నిడదవోలు ఈఈ, డ్రెయినేజీలకు సంబంధించి భీమవరం ఈఈ పర్యవేక్షిస్తున్నారు. వీటితో పాటు నరసాపురం తణుకు, టీపీగూడెం, ఉండి, ఏలూరుల్లో ఇరిగేషన్ సబ్‌డివిజన్లు ఉన్నాయి.

మొత్తం నీటి సంఘాలు 131

రైతులే కాల్వలను పర్యవేక్షించేందుకు వీలుగా ఉమ్మడి రాష్ట్రంలో నీటి సంఘాలను అప్పటి టీడీపీ ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చింది. రాష్ట్ర విభజన తరువాత వీటికి ఎన్నికలు పెట్టింది. గత ప్రభుత్వ హయాంలో ఈ సంఘాలు కాల పరిమితి తీరి నిర్వీర్యమయ్యాయి. మళ్లీ కూటమి ప్రభుత్వం జిల్లాలోని 131 సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమైంది. ప్రతి నీటి సంఘం ఆయకట్టును బట్టి విస్తరించింది. కొన్ని ఆయకట్టు పరిధిలో 1500 నుంచి 2 వేల మంది వరకు రైతులు ఉన్నారు. మరికొన్ని పరిధిల్లో 2500 మంది వరకు రైతులు ఉన్నారు. ఇలా జిల్లాలోని నాలుగు సబ్‌డివిజన్లలో 131 సంఘాలు ఉన్నాయి. ఇవి కాకుండా నరసాపురం ఆరు, ఉండి ఐదు, తాడేపల్లిగూడెం ఐదు, తణుకులో ఆరు డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నాయి. రెండు జిల్లాల్లో కలిపి మొత్తం 31 కమిటీలు ఉన్నాయి. వీటితో పాటు ఆరు ప్రాజెక్టు కమిటీ డైరెక్టర్లు ఉంటారు.

ఎన్నికలు జరిగేదిలా..

ఇరిగేషన్ అధికారులు ఆయకట్టుకు సంబంధించిన వివరాలన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఆయకట్టు, నీటి పన్ను చెల్లించే రైతుల వివరాల ప్రకారం ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తున్నారు. దీన్ని ముందుగా పంచాయతీల్లో నోటీస్‌బోర్డుల్లో ఉంచుతారు. ఏదైనా అభ్యంతరాలు ఉంటే వాటిని స్వీకరించి సరి చేస్తారు. ఈ ప్రక్రియంతా వచ్చే నెల 15 నాటికి పూర్తి చేసి మండలాల వారీగా జాబితాలను ప్రకటిస్తారు. ఆ తరువాత 16 నుంచి 18 వరకు నీటి సంఘాలకు ఎన్నికల్ని నిర్వహించి అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికల్ని పూర్తి చేస్తారు. ఆ తరువాత 18 నుంచి 21 వరకు డిస్ట్రిబ్యూటరీ కమిటీలు నిర్వహించి ఉమ్మడి జిల్లాలో మొత్తం 30 డీసీలను ఎన్నుకుంటారు. ఆ తరువాత 22 నుంచి 24 వరకు ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు నిర్వహిస్తారు. ఎన్నికైన 30 మంది డీసీలు తమలో ఆరుగుర్ని ప్రాజెక్టు కమిటీ డైరెక్టర్లగా నియమించుకుంటారు. చివరికి ఈ ఆరుగురు కలిసి తమలో ఒకరిని డెల్టాప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా, మరొకర్ని ఉపాధ్యక్షులుగా ఎన్నుకుంటారు. ఇలా వచ్చే నెల 24 నాటికి ఈ ఎన్నికల ప్రక్రియ అంతా పూర్తి చేయనున్నారు.



గోరింటాడలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న మంత్రి నిమ్మల

గ్రామ స్వరాజ్యం ఎన్డీఏతోనే : మంత్రి నిమ్మల

పాలకొల్లు రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి):బాపూజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం ఏన్‌డీఏ ప్రభుత్వం ద్వారా సాధ్యమవుతోందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. సగంచెరువు, గోరింటాడ గ్రామాల్లో పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా రూ. రెండు కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు మంత్రి సోమవారం శంకుస్థాపనలు చేశారు. రానున్న కాలంలో పల్లె రూపులు మారబోతున్నాయని మంత్రి నిమ్మల అన్నారు. అతి చిన్న గ్రామాలకు ఒక్క రోజులోనే రూ.2 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చేసుకోవడం అంటే అది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే సాధ్యం అని అన్నారు. వారం రోజులపాటు జరిగే పల్లె పండుగ కార్యక్రమంలో రాష్ట్రంలో రూ.4500 కోట్లతో 30 వేల పనులు చేపడుతున్నట్టు తెలిపారు.

గ్రామాల అభివృద్ధితోనే ప్రగతి: కలెక్టర్

నరసాపురం రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి):గ్రామాలు అభివృద్ధితోనే ప్రగతి సాధ్యమని కలెక్టర్ నాగరాణి అన్నారు. మర్రితిప్పలో రూ.15 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే నాయకర్‌తో కలిసి సోమవారం కలెక్టర్ ప్రారంభించారు. డ్వాక్రా భవనానికి శంకుస్థాపన చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి కార్మికులకు పనులు కల్పించాలన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం పెద్ద ఎత్తున్న ఎన్ఆర్‌జీఎస్ పనులను మంజూరు చేసిందన్నారు. కార్మికులు ఎంత పని చేసుకుంటే అంత ఉపాధి దొరుకుతుందన్నారు. ఎమ్మెల్యే నాయకర్ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో ఈ నిధులతో పనులు చేపడతామన్నారు. ప్రతి వీధికి రోడ్డు, కుళాయి వేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పీఆర్ డీఈ సత్యనారాయణ, ఏఈ నాగేశ్వరరావు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

spicy · tasty

స్పైసీగా..

నయా ట్రెండ్



ఇక్కడే వెరైటీ నాన్‌వెజ్ రుచులు
పెరిగిన రెస్టారెంట్ కల్చర్
హైదరాబాద్ దమ్ బిర్యానీ ఇక్కడే..

హైదరాబాద్ బిర్యానీ..తందూరి చికెన్.. చికెన్ మంచురీయా.. పంజాబీ.. మొగలాయి బిర్యానీ.. ఇలాంటి నాన్ వెజ్ వంటకాల రుచి చూడాలంటే నగరాలకు వెళ్లినప్పుడే సాధ్యమయ్యేది.. కానీ కాలం మారిపోయింది...జనం కోరుకుంటున్న రుచి కరమైన వంటకాలన్నీ ఇక్కడే దొరికేస్తున్నాయి.. అంతేకాదు ఎక్కడ ఏ వంటకం ఫేమస్ అయితే అక్కడకు వెళ్లి మరీ టేస్ట్ చేస్తున్నారు.. అందుకే మన ప్రాంతంలోనే ఎన్నో రెస్టారెంట్లు వెలుస్తున్నాయి.. మంచి చెఫ్‌లను తీసుకు వచ్చి నగరాల్లోనే కనిపించే వెరైటీ రకాలను ఇక్కడ రుచి చూపిస్తున్నారు.

- నరసాపురం/ఆంధ్రజ్యోతి

నాన్‌వెజ్ ప్రియుల నోరూరించే హైద్రాబాద్ బిర్యానీ ఇప్పుడు జిల్లాలోనే వండేస్తున్నారు. వీటితోపాటు డ్రాగన్ చికెట్, చిల్లీ చికెట్, దిల్‌కుష్ బిర్యానీ, చికెన్ 35, ఆర్మీ చికెన్, చికెన్ 666, ఫ్రైపీస్ బిర్యానీ, దమ్మ్ బిర్యానీ, మటన్‌కిమా బిర్యానీ, మటన్ దమ్ బిర్యానీ, కిచిడి బిర్యానీ వంటి స్పైసీ పుడ్స్‌ను ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని రెస్టారెంట్‌లు పోటీపడి తయారు చేస్తున్నాయి. కస్టమర్ల అభిరుచికి అనుగుణంగా రకరకాల నాన్‌వెజ్ వంటకాలు ప్రస్తుతం ఇక్కడే దొరికేస్తున్నాయి. దీనికి కావాల్సిన కుక్‌లను ఒడిశా, బిహార్, కోల్‌కతా, హైదరాబాద్‌ల నుంచి వేలకు వేలు జీతాలు ఇచ్చి రప్పిస్తున్నారు.



నాన్ వెజ్ కుక్స్‌కు డిమాండ్ : అర్జున్, కుక్, నేపాల్

నాన్ వెజ్ కుక్స్‌కు మంచి డిమాండ్ ఉంది. గతంలో నగరాల్లో మాత్రమే ఉపాధి ఉండేది. నేడు చిన్న చిన్న పట్టణాల్లోను రెస్టారెంట్‌లు పెట్టేస్తున్నారు. నగరాల్లో దొరికే వంటకాలను వండించి కస్టమర్లను ఆకర్షిస్తున్నారు. మాలాంటి వారికి మంచి ఉపాధి పెరిగింది. అడ్వాన్స్‌లు ఇచ్చి మరీ తీసుకొస్తున్నారు.



కొత్త రుచుల్ని ఇష్టపడుతున్నారు.

కస్టమర్లు స్పైసీ రుచులను ఇష్టపడుతున్నారు. బిర్యానీల్లో ఎన్ని వైరటీలు వచ్చినా.. ఇంకా కొత్తదాని కోసం చూస్తున్నారు. చికెన్, మటన్‌ల్లోను కొత్త వంటకాలు పేర్లు చెబితే.. రుచి చూసేందుకు ఆసక్తి చూపుతున్నారు. కొంత మంది కస్టమర్లు అడిగి వారికి కావాల్సిన రుచికి అనుగుణంగా మరి చేయించుకుంటున్నారు. దీనివల్ల కుక్స్‌ను కూడా ఇతర ప్రాంతాల నుంచి తీసుకురావాల్సి వస్తోంది.

- సన్నీ, రెస్టారెంట్ యజమాని, నరసాపురం





బిర్యానీలకే డిమాండ్

ఒకప్పుడు బిర్యానీల్లో పలావ్ మాత్రమే ఉండేది. ప్రస్తుతం దీన్ని ఎవరూ ఇష్టపడటం లేదు. ఇప్పుడంతా దమ్ బిర్యాని, లేదా కీమా బిర్యాని, మొగలాయ్, దిల్ కుష్, పంజాబీ బిర్యానీలకే డిమాండ్. అయినప్పటికీ కస్టమర్లు ఇంకా కొత్త రకం కోరుకుంటున్నారు.

- మాణిక్యం, రెస్టారెంట్ యజమాని

కోట్లలో వ్యాపారం

జిల్లాలో నాన్‌వెజ్ వ్యాపారం కోట్లల్లో సాగుతోంది. ఒకప్పుడు దూర ప్రాంతాలకు వెళితే హోటళ్లు, మెస్‌ల్లో భోజనం చేయడం అనవాయితీ. నేడు జిల్లాల్లో హోటళ్లు, మెస్‌ల సంఖ్య తగ్గిపోయింది. వీధి వీధికి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, రెస్టారెంట్లు దర్శనమిస్తున్నాయి. కస్టమర్లు కూడా మంచి రెస్టారెంట్లను ఆరాతీసి మరీ వెళుతున్నారు. ఉమ్మడి పశ్చిమలో అత్యధికంగా రెస్టారెంట్లు ఏలూరు, భీమవరంలలో ఉన్నాయి. తర్వాత తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, నరసాపురం, జంగారెడ్డిగూడెంలలో ఉన్నాయి. ఇవి కాకుండా మండల కేంద్రాల్లోను రెస్టారెంట్లు వెలుస్తున్నాయి. జిల్లాలోని మొత్తం రెస్టారెంట్లలో వ్యాపారం రోజుకు రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్లపైనే ఉంటుంది. వీకెండ్లు, ఆదివారాలు, సెలవు రోజుల్లో రూ.4 కోట్లపైనే వ్యాపారం సాగుతుంది.

వెరైటీ పేర్లు

ఇప్పుడు రెస్టారెంట్ల పేర్లు వెరైటీగా ఉంటున్నాయి. గతంలో దేవుడు పేర్లతో పాటు సొంత పేర్లు కనిపించేవి. ఇప్పుడు హంగర్‌బౌల్, సెకండ్ వైఫ్, రాజు గారి రెస్టారెంట్, నాయుడు గారి కుండ బిర్యానీ, గోంగూర రెస్టారెంట్ వంటి పేర్లతో కస్టమర్లను ఆకర్షిస్తున్నారు. మన ప్రాంతంలో నాన్‌వెజ్ ప్రియులు కాజా బిర్యాని, సీతయ్య బిర్యాని, కుండ బిర్యానీలు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ఎంతో పేరు గాంచిన హోటళ్లలో ఈ రుచుల్ని ఆస్వాదించేందుకు ఇతర ప్రాంతాల నుంచి రావడం గమనార్హం.

ఇంటికే ..డెలివరీ

గతంలో ఏదైనా తినాలంటే రెస్టారెంట్‌కు వెళ్లాల్సి వచ్చేది. లేదా పార్శిల్ పట్టుకు వెళ్లేవారు. గడిచిన మూడేళ్లలో డోర్ డెలివరీ విధానం పెరిగింది. ఆన్‌లైన్‌లో నచ్చిన ఫుడ్ ఆర్డర్ చేస్తున్నారు. ఇంట్లో కుటుంబ సభ్యులు అంతా కలిసి రుచి చూస్తున్నారు. వ్యాపారం కూడా భారీగా పెరిగింది. దీనికి టైం అంటూ లేదు. ఉదయం నుంచి రాత్రి 11 గంటల వరకు ఏ సమయంలోనైనా బుక్ చేసుకునే వెసులుబాటు ఉండటంతో మారుమూల గ్రామాలకు నాన్‌వెజ్ పార్శిల్స్ వెళుతున్నాయి. జొమోటా, స్విగ్గీ వంటి డోర్ డెలివరీ సంస్థలు దర్శనమిస్తున్నాయి.

చారిత్రక వైభవం



వెయ్యేళ్ల గాలి గోపురం

అలనాటి ప్రాచీన సంస్కృతీ, సంప్రదాయాలకు నిలయాలు మన ఆలయాలు. ఆలయాల్లోని ప్రతీ గాలి గోపురానికి ఓ ప్రాముఖ్యత ఉంటుంది. అపురూపమైన చిత్రకళకు, శిల్ప కళా సంపదకు అవి ఆనవాళ్లు. ఏలూరులోని శనివారపుపేట చెన్నకేశవస్వామి ఆలయంలోని గాలి గోపురం వెయ్యేళ్ల చరిత్ర కలిగినది. ఇది చాళుక్యుల కాలం నాటి వైభవానికి ప్రతీకగా నిలుస్తోంది. వంద అడుగుల ఎత్తులో నాలుగు అంతస్తులుగా ఉంటూ విశేష శిల్ప కళా సంపదతో చూపరులకు కనువిందు చేస్తోంది. 11వ శతాబ్దంలో దీని నిర్మాణం జరిగింది. చాళుక్యుల కాలంలో జరిగినట్లు పురావస్తు శాఖ నిర్ధారించింది. గోపురంపై ఆనాటి చాళుక్య రాజుల సంస్కృతీ, సంప్రదాయాలతోపాటు రామాయణం, శ్రీరామపట్టాభిషేకం, మహాభారతం, భాగవతం వంటి పురాణ ఇతిహాసాలు, క్షీరసాగర మథనం, యక్షులు, గంధర్వులు, కిన్నెరలు, కింపురుషులు, ఆళ్వార్లు, రుషులు, మునులు, వాత్సాయన కామసూత్రకు సంబంధించిన శిల్పాలను శాస్త్రీయ విధానంలో ప్రాచీన వైభవానికి సంకేతంగా నిర్మించారు. పూర్తిగా ఇసుక, రాతి శిలతో నిర్మితమైన ఈ గాలి గోపురం కొన్నేళ్ళ క్రితం శిథిలావస్థకు చేరుకుంది. 2004లో గోపురం మీద ఉన్న శిలా సంపదను తొలగించి పునర్ నిర్మించారు. చాణుక్యుల రాజుల కాలంలో గోపురం నిర్మితమైనప్పటికి తరువాత కాలంలో అప్పటి జమీందార్లు మేకా ధర్మఅప్పారావు ఆలయానికి పోషకులుగా ఉన్నట్లు ఇక్కడ శాసనాల ద్వారా తెలుస్తోంది. ద్వారకాతిరుమల దత్తత ఆలయంగా ఉన్న ఈ ఆలయం ప్రస్తుతం దేవదాయ శాఖ పరిధిలో ఉంది. ఈ ఆలయంలో విష్ణుమూర్తి, చెన్నకేశవుడిగా, వేంకటేశ్వరుడిగా రెండు రూపాల్లో కొలువై ఉన్నాడు.

- ఏలూరు రూరల్ /ఆంధ్రజ్యోతి



గాలి గోపురంపై శిల్పకళా సౌందర్యం

మేడపైనే కూరల సాగు

ఇప్పుడు ఏం తిందామన్నా కల్తీ అయిపోయింది. కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు ఇలా అన్నీ రసాయన మందులతో కలుషితమై పోతున్నాయి. వాటిని తినడం వల్ల ఆరోగ్యమూ పాడవుతోంది. వీటికి చెక్ పెట్టేందుకు ప్రకృతి సిద్ధంగా ఎటువంటి రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకుండా తమ ఇంటిపైన మిద్దె తోట సాగు చేపట్టారు చాట్రాయికి చెందిన గోళ్ళ విశ్వేశ్వరరావు, శేషకుమారి దంపతులు. గతంలో మార్కెట్ నుంచి కూరగాయలు ఆకుకూరలు కొనుగోలు చేసి ఉపయోగించేవారు. అవి తినడం వలన అనేక ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతూ ఆసుపత్రులకు ఎంతో డబ్బు ఖర్చు పెట్టేవారు. దీంతో వీరికి మిద్దెతోట ఆలోచన వచ్చింది. స్థానిక చెరువు నుంచి సారవంతమైన మట్టి తెచ్చి ఇంట్లో ఉన్న పనికిరాని డబ్బాలు, డ్రమ్ముల్లో మట్టిని నింపి వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరలు, పూలు విత్తనాలు నాటారు. ఎటువంటి రసానిక ఎరువులు వేయకుండా కేవలం పశువుల పేడ మాత్రమే ఉపయోగిస్తూ సాగు చేపట్టారు. వంగ, బెండ, దొండ, టమాటా మొదలైన కూరగాయలు, పాలకూర, తోటకూర, బచ్చలి, కొత్తి మీర, పుదీనా మొదలైన ఆకుకూరలు పండిస్తున్నారు. తమ కుటుంబ అవసరాలకు పోను మిగిలినవి స్నేహితులకు ఉచితంగా ఇస్తున్నారు.

- చాట్రాయి/ఆంధ్రజ్యోతి

ఆరోగ్యంగా జీవిస్తున్నాం





ఇప్పుడంతా రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడి పండించిన కూరగాయలనే తినాల్సి వస్తోంది. దీనివల్ల చాలా అనారోగ్య సమస్యలు వస్తాయి. మేము కూడా చాలా ఇబ్బందులు పడ్డాం. ఆసుపత్రుల చుట్టూ తిరిగి శారీరకంగా, ఆర్థికంగా నష్టపోయాం. కుటుంబ ఆరోగ్యం కోసం ఈ మిద్దె తోట సాగు చేపట్టాం. రోజు రెండ గంటలపాటు మిద్దె తోటలో పని చేయడం వల్ల ఆరోగ్యం మెరుగైంది. కల్తీ లేని కూరలు తింటున్నాం. కుటుంబ సభ్యులందరికి ఆరోగ్య సమస్యలు తగ్గిపోయాయి. ఆసుపత్రులకు వెళ్ళే అవసరం కూడా తగ్గింది.

- గోళ్ళ విశ్వేశ్వరరావు, శేషకుమారి దంపతులు, చాట్రాయి.

మిద్దె తోట



మేడపైన ఎన్ని మొక్కలో..

చేతివాటం సరిగా లేకుంటే..

రోగాలు ఖాయం





మధ్యాహ్న భోజన సమయంలో పిల్లలు చేతులను కడుక్కోకపోవడం వల్లే వారు తరచూ అతిసార వ్యాధికి గురవుతున్నారని 1940లో వియత్నాంలోని వియన్నా జనరల్ హాస్పటల్ వైద్యాధికారి ఇగ్నేజ్ సెమ్మెల్‌విస్ తన పరిశోధనల్లో గుర్తించారు. అందుకే ఆయనను పరిశుభ్రత పితామహుడుగా పిలుస్తారు. అలాగే అతిసార, శ్వాసకోస వ్యాధులకు గురై ఏటా వేలాది మంది చిన్నారులు చనిపోవడానికి చేతులు పరిశుభ్రంగా ఉంచుకోకపోడమే కారణమని ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్ధారించింది. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఐక్యరాజ్యసమితి 2008 అక్టోబరు 15న ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవంగా జరుపుకోవాలని నిర్ణయించింది.



నిడమర్రు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి):చిన్నారులకు తమ పాఠశాల వయసు నుంచే చేతుల పరిశుభ్రతపై అవగాహన పెంచడం కోసం ఐక్యరాజ్యసమితి అక్టోబరు 15న ప్రపంచవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో చేతుల పరిశుభ్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. తల్లిదండ్రులు తమ చిన్నారులకు చేతులు పరిశుభ్రంగా కడుక్కోవడాన్ని అలవాటు చేయాలి. పాఠశాలల్లో ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన సమయంలో ప్రతి పిల్లవాడితోను చేతులు కడుక్కున్న తర్వాత ఆహారం తీసుకొనేలా అవగాహన కల్పించాలి.

ఆరోగ్యానికి రక్ష

మన తీసుకొనే ఆహారం ద్వారానే మనకు రోగాలు వస్తాయని వైద్యులు చెబుతున్నారు. తీసుకొనే ఆహారం పరిశుభ్రమైనప్పుడు రోగాల నుండి దాదాపు దూరంగా ఉండవచ్చు. 90 శాతం రోగాలు ఆహారం తీసుకునే ముందు చేతులు కడుక్కోకపోవడం ద్వారా వ్యాపిస్తాయి. బ్యాక్టీరియా, వైరస్‌లు చేతుల ద్వారా మన ఆహారంతోపాటు జీర్ణాశయంలో ప్రవేశించి అనేక రోగాలకు కారణమవుతున్నాయి. చేతులు పరిశుభ్రత ద్వారా పిల్లల్లో 20 శాతం నుంచి 40 శాతం డయేరియా రోగాలు తగ్గుముఖం పట్టాయి. 58 శాతం మందిలో డయేరియా వ్యాధికారక క్రిములు నిర్మించబడ్డాయి. 20 శాతం మందిలో శ్వాసకోస రోగాలు వ్యాప్తి నివారించబడిందని పరిశోధనలు నిర్ధారించాయి.

చేతుల శుభ్రత ఇలా..

- రోగాల నివారణకు.. చేతుల పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్య నిపుణులు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరు చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలి.
- ముందుగా చేతులను నీళ్లతో తడిచేసుకుని, సోప్‌తో గానీ, హ్యాండ్ వాషింగ్ లిక్విడ్‌తో కాని నురుగ వచ్చే వరకు రుద్దాలి.
- సబ్బు నరుగతో అరచేయిలో మరో అరచేయి వేసి రుద్దాలి.
- చేతి వేళ్ల సందుల్లో వేళ్లు వేసి రుద్దుకోవాలి.
- చేతుల గోళ్ల వద్ద ప్రత్యేకంగా సబ్బుతో రుద్దుకోవాలి.
- చేతుల ఉపరితలం మీద సబ్బుతో మణికట్టు వరకు రద్దుకోవాలి.
- నడుస్తున్న నీటితో చేతులు శుభ్రం చేసుకోవాలి.
- పొడి గుడ్డతో లేదా సింగిల్ యూజ్ పేపర్ (టిష్యూ పేపర్) తో తుడుచుకోవాలి.
- ఈ ప్రక్రియ సుమారు 20-30 సెకన్లపాటు నిర్వహిస్తే మన చేతిలో క్రిముల 95% వరకు నిర్మూలించవచ్చని వైద్యులు చెబుతున్నారు.

చేతులను శుభ్రంగా ఉంచుకోవాలి

డాక్టర్ కిరణ్ కొత్తకొండ, ఫార్మాస్యూటికల్ సైంటిస్ట్

చేతుల ద్వారానే 90 శాతం క్రిములు శరీరంలోకి ప్రవేశిస్తాయని పరిశోధనల్లో నిరూపితమైంది. అతి తక్కువ ఖర్చుతో సమర్థవంతంగా చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవచ్చు. దీనిపై పాఠశాల స్థాయి నుండే విద్యార్థులకు అవగాహన కల్పించడం ద్వారా పిల్లలను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దవచ్చు.

చేతులు ఎప్పుడు కడుక్కోవాలి

- మల విసర్జన, మూత్ర విసర్జనల తర్వాత
- భోజనాలు తయారుచేసే ముందు.. తినే ముందు..
- దగ్గు వచ్చిన తర్వాత.. ముక్కు చీదిన తరువాత
- చేతులు మురికిగా ఉన్నప్పుడు..
- జంతువులను తాకిన తర్వాత
- పేడ వంటి జంతువుల మల మూత్రాలను తాకిన తర్వాత తప్పనిసరిగా చేతులు పరిశుభ్రం చేసుకోవాలని సూచించింది.

ఆరోగ్యానికి అదే రక్ష

ఎస్.అబ్రహం, డీఈఓ, ఏలూరు

ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవంపై జిల్లాలోని అన్ని పాఠశాలల్లో మంగళవారం ఆరోగ్య సిబ్బందితో కలిసి విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు జరుగుతాయి. ప్రత్యేకంగా చేతులను ఎలా శుభ్రంగా కడుక్కోవాలో వివరిస్తాం. పరిశుభ్రమైన చేతులే ఆరోగ్యానికి రక్ష అని వారికి అర్థమయ్యే విధంగా తెలియచెబుతాం.



శ్రీవారి క్షేత్రానికి బ్రహ్మోత్సవ శోభ

ద్వారకాతిరుమల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవ శోభతో చిన్న తిరుమలేశుని క్షేత్రం మిరు మిట్లు గొలుపుతోంది. ఆశ్వయుజ మాస దివ్య బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని క్షేత్ర పరిసరాలు సర్వాంగ సుందరంగా ముస్తాబై చూపరులకు కనువిందు చేస్తోంది. ఈ క్రమంలో ఆలయాన్ని, పరిసరా లను విద్యుద్దీప తోరణాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ గోపురాలు విద్యుత్ దీప కాంతులతో కళకళలాడుతున్నాయి. అనివేటి మండప ప్రాంతం విద్యుత్ కాంతులతో మెరిసి పోతోంది. ఆలయ పాతకల్యాణమండపం ముందున్న విలాస మండపం వద్ద శ్రీవారు, అమ్మవార్ల దాదాపు 20 అడుగుల భారీ విద్యుత్ కటౌట్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఆలయ విద్యుత్ డీఈ సూర్యనారాయణ పర్యవేక్షణలో ఈ విద్యుత్ తోరణాలు ఏర్పాటయ్యాయి.



నేత్రపర్వం..ధ్వజారోహణం.

బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవాలకు సకల చరాచర సృష్టికి ఆహ్వానం పలుకుతూ సోమవారం రాత్రి జరిగిన ధ్వజారోహణ వేడుక భక్తజనకోటికి కన్నుల పండువైంది. వైఖానస ఆగమ యుక్తంగా ఇంద్రాది అష్టదిక్పాలకులు, సర్వ దేవతలను, దేవగణాలను, స్వాగతిస్తూ వేద మంత్రోచ్ఛరణలతో అర్చకులు శ్రీవారి ఆలయ ప్రాకారంలోని ధ్వజస్తంభంపై గరుడపటం ఎగురవేశారు. సాయంత్రం ఆలయంలో అంకురార్పణ శాస్త్రోక్తంగా జరిపారు. బ్రహ్మోత్సవాల్లో మంగళవారం ఉదయం 7 గంటలకు సూర్యప్రభ వాహనంపై తిరువీధిసేవ, ఉదయం 8-30 నుంచి భజన సంకీర్తనలు, రాత్రి 7 గంటల నుంచి చంద్రప్రభ వాహనంపై గ్రామోత్సవం జరుగుతాయి.



ధ్వజపటం ఎగురవేస్తున్న అర్చకులు

అమ్మవారి లడ్డు రూ. 1,11,000



ఆకివీడురూరల్ అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆకివీడు మండలం చినకాపవరం పంచాయతీ పరిధిలోని జానకిరామరాజపురంలో అమ్మవారి 90 కిలోల లడ్డు వేలంలో రూ.1,11,000 సరిపల్లె నరేష్‌రాజు దక్కించుకున్నారు. అమ్మవారి లడ్డు దక్కించుకునేందుకు ప్రతిఏటా పెద్దఎత్తున వేలంలో పాల్గొంటారు. అమ్మవారి ఉత్సవాలు ప్రారంభించిన నాటి నుంచి గ్రామానికి చెందిన భూపతిరాజు రంగరాజు లడ్డు దక్కించుకునే వారు. ఆయన అల్లుడైన సరిపల్లె నరేష్ ఈసారి దక్కించుకోవడం విశేషం.

నాన్‌వెజ్ వంటకాలతో అన్న సంతర్పణ

ఆకివీడురూరల్ అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా పండుగలకు నిర్వహించే సంత ర్పణలు పూర్తిగా శాఖాహారంగా ఉంటాయని తెలుసు. కానీ ఆ గ్రామంలో మాత్రం నాన్‌వెజ్ వంటకాలతో నిర్వహిస్తారు. ఆకివీడు మండలం సిద్దాపురంలోని బీటులోని రామాలయం వద్ద ఏటా దసరా నవ రాత్రులు ఘనంగా నిర్వహి స్తారు. అమ్మవారి నిమజ్జనం అయిన తరువాత నిర్వహించే అన్న సంత ర్పణలో రెండు రకాలు మాంసాహారంతో పాటు, కోడిగుడ్డు, బిర్యాని, బూరి, గుమ్మడికాయ దప్పళం, రసంతో పాటు ఒక శాఖాహార కూర వడ్డిస్తారు. దీంతో భోజన ప్రియులు ఈ సంతర్పణకు క్యూ కడతారు. నవరాత్రులు పూర్తిగా ఉపవాసాలు ఉంటామని దసరా పూర్తయిన సందర్భంగా ఇలా నాన్ వెజ్ వంటకాలతో చప్పబడిన నాలుకకు రుచి చూపి స్తామని అక్కడివారు చెప్పారు..



అన్నిటా ఆమె

సాధికార దిశగా అడుగులు

నేడు అంతర్జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవం

యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః... ఎక్కడ స్త్రీలు పూజింప బడతారో అక్కడ దేవతలు వెలుస్తారని దీని భావన.. వాస్తవంలో నిజమే అని నిరూపిస్తున్నారు నేటి మహిళలు. ఏ రంగంలోనూ పురుషులకూ తామేమీ తక్కువ కాదన్నట్లు దూసుకు పోతు న్నారు. అన్ని చోట్లా గౌరవ ప్రదమైన స్థానాన్ని సంపాదించుకుంటు న్నారు. అందరికీ మంచి ఆహారం పండిస్తున్న రైతు మిత్రులకు సహాయ సహకారా లందించే విషయంలో, ఆహార ఉత్ప త్తులు పండించే విషయంలో, వివిధ రంగాల్లో గ్రామీణ మహిళలు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారు. నేడు అంతర్జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం

- పోలవరం , గణపవరం

ఉత్పత్తి నుంచి ఆహార పదార్థాలను తయారు చేయడం, ప్రోసెస్ చేయడం పంపిణీ, రవాణా చేయడంలో మహిళల శ్రమ వర్ణించలేనిది.

గ్రామీణ ప్రాంతాల్లో పండించే వరి, మొక్కజొన్న ఇతర ఆహార ధాన్యాల సాగులో మహిళలదే ప్రధాన పాత్ర. వరినాట్లు వేయడం నుంచి కలుపు తీసి వరి కోత కోసే వరకూ, మొక్కజొన్న విత్తనం వేసిన నాటి నుంచి కలుపు తీసి పొత్తు విరిచి గింజ రాల్చే వరకూ, మినుము, పెసర , కంది అపరాలు, కూరగాయల పంటల సాగులో మహిళలదే ప్రధాన పాత్ర. కోళ్ళ ఫారాలలో గుడ్లు సేకరించి ట్రేలలో పేర్చడం, కోళ్ళకు దాణా వేయడం, బేకరీల్లో, హోటళ్ళలో ఆహార పదార్థాల తయారీలో, పచ్చళ్ళ పరిశ్రమల్లో, తినుబండారాల తయారీ, ప్యాకింగ్ పరిశ్రమల్లో మహిళలు లేకుండా పని ముందుకు సాగదు. డ్వాక్రా స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థికంగా బలపడి వ్యాపారాలు , పాడి పశువుల పెంపకం, పెరటి కోళ్ళ పెంపకం, కుట్టు మిషన్లు, కిరాణా దుకాణాల నిర్వహణ ద్వారా ఆర్థికంగా కుటుంబానికి సహాయపడుతున్నారు.

కొవిడ్ 19 మహమ్మారి సంక్షోభ సమయంలో 2020 సంవత్సరంలో సుమారు 2.37 బిలియన్ల మంది ప్రజలకు ప్రస్తుతం పండించే ఆహారం చాలక ఆకలికి అలమటించారు. ఆ పరిసితుల్ని దాటి ఆహార ఉత్పత్తులు పెంచేందుకు,గ్రామీణ మహిళలకు జీవనోపాధి ద్వారా మద్దతు ఇవ్వడం కోసం వారిలో నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు అలవరచడానికి యునైటెడ్ నేషన్స్ కృషి చేస్తు న్నది. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పొందుతూ, సాటి మహిళలకు ఉపాధి కల్పిస్తూ ముందుకు దూసుకుపోతున్న మహిళల గురించి వారి మాటల్లోనే మనం తెలుసుకుందాం



- పదో తరగతి చదివాను. వివాహమై ఏడు సంవత్సరాలైంది. డ్వాక్రా స్వయం సహాయక సంఘం ద్వారా రుణం పొంది కిరాణా కొట్టు నిర్వహించాను. మొదట్లో నాకు మాత్రమే ఉపాధి లభించింది.ఆర్థికంగా కొంతవరకు సమస్య తీరింది. నాకు నైపుణ్యం ఉన్న జీడిపప్పు ప్రోసె సింగ్ యూనిట్ ప్రారంభించాను. జీడి గింజల నుంచి పప్పు వేరు చేసే మిషన్ల ద్వారా నాతో పాటు మా వీధిలో మరో పదిమంది మహి ళలకు ప్రోసెసింగ్ శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిం చాను. ప్రభుత్వం సహకరించి పెద్ద యూనిట్ స్థాపనకు రుణం మంజూరు చేస్తే మరింతమంది మహిళలకు ఉపాధి కల్పించగలను.

-జయవరపు శివజ్యోతి, పోలవరం

- నేను డ్వాక్రా ద్వారా రుణం పొంది కర్రీ పాయింట్ ప్రారం భించాను. నాలు గేళ్ళగా కర్రీ పాయింట్ నిర్వహిస్తున్నాను. ఇద్దరు ఆడపిల్లల్ని చదివిస్తున్నాను. నాతో పాటు మరో నలుగురు మహిళలు ఉంటున్నారు.

-చిలకా శ్రీదేవి,పోలవరం



- 12 సంవత్సరాలుగా జ్యూస్ సెంటర్ నడుపు తున్నాం. మేము ముగ్గురు అక్క చెల్లెలం. జ్యూస్ సెంటర్ నిర్వహిస్తూ ఉపాధి పొందుతున్నాం. కుటుంబానికి మేమే ఆధారంగా ఉన్నాం. జ్యూస్ సెంటర్ సీజనల్ వ్యాపారమైనప్పటికీ ఏడాది పొడవునా కొనసాగిస్తున్నాం. అలవాటు ఉన్న విని యోగదారులు క్వాలిటీ రీత్యా నిత్యం కొనుగోలు చేస్తుంటారు.

వెలగంటి ఊహ, పోలవరం



ఆర్థికంగా నిలదొక్కుకోవాలి



మహిళలకు ఆర్థికంగా నిలదొక్కు కుంటే ఆ కుటుంబం సుఖసంతో షాలతో ఉంటుంది. పురు షులే కుటుంబాన్ని పోషించాలంటే నేడు కష్టం. సీజనల్‌గా లభించే పండ్లను గణపవరం రహదారి పక్కన విక్రయి స్తుంటాను. ప్రస్తుతం నిమ్మ కాయలు మెట్ట ప్రాంతం నుంచి కొనుగోలు చేసి ఇక్కడ విక్రయిస్తున్నాం. రోజూ ఖర్చులు పోను రూ.500 వరకు వస్తుంది. వచ్చిన సొమ్ముతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాం.

- తాడిగడప కుమారి, చిరువ్యాపారి, గణపవరం

కుటుంబానికి ఆసరాగా..



కాకినాడ, నర్సాపురం ప్రాంతాల నుంచి పీత లను కొనుగోలు చేసుకుని గణపవరంలో విక్ర యిస్తుంటాను. రోజూ రూ.600 నుంచి రూ.800 వస్తుంది. ఎవరి దగ్గరకు పనికోసం వెళ్లనవసరం లేకుండా సొంతంగా సంపాదించు కుని కుటుంబానికి తోడుగా ఉంటున్నాను.

- జెక్కా శేషాయమ్మ, గణపవరం



నోట్ల కట్టల కట్టలు..

భీమవరం, ఏలూరుల్లో సోమవారం మద్యం దుకాణాలకు సంబంధించి డ్రా తీశారు.. జాక్‌పాట్ కొట్టిన వారు లైసెన్స్ ఫీజు కట్టేందుకు తెచ్చిన సొమ్ములు అధికారులు మెషిన్లపై ఇలా లెక్కపెట్టి కట్టలు కట్టారు...



గ్రామీణ ఆరోగ్యానికి 'ప్రక్షాళన' ఆవశ్యం

పలు ఆరోగ్య ఉపకేంద్రాల్లో అవసరానికి మించి ఏఎన్ఎంలు

ఏలూరు అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పలు ప్రభుత్వ శాఖలు సంతృప్తికర స్థాయిలో ఉద్యోగులు లేక పనిభారాన్ని, తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటుండగా వైద్య ఆరోగ్యశాఖలో కొన్ని విభాగాలు ఇబ్బడి ముబ్బడిగా సిబ్బందితో 'పని విభజన - సిబ్బంది హేతుబద్ధీకరణ' సమస్యను ఎదుర్కొంటున్నట్టు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ఆరోగ్య ఉప కేంద్రాలు, సచివాలయాలు, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లలో ఏఎన్ఎంల విషయంలో ఈ సమస్య స్పష్టంగా కనిపిస్తోందని చెబుతున్నారు. ఇటీవలే సచివాలయాల్లో డిప్యూటేషన్లపై ఏఎన్ఎం విధులు నిర్వర్తిస్తున్న ఆరోగ్య ఉప కేంద్రాల ఏఎన్ఎం (ఎంపీహెచ్ఏ)లు తమను మాతృ శాఖ (వైద్యఆరోగ్యశాఖ)కు పంపాలనే డిమాండ్ పరిష్కారం కాకుండానే, ఇంటెన్సిఫైడ్ జీఎన్ఎం శిక్షణను పూర్తిచేసుకున్న సచివాలయ ఏఎన్ ఎంలు వారి స్థానాల్లో విధుల్లోకి చేరి పోయిన విషయం విదితమే. మరోవైపు ఒక్కో గ్రామం పరిధిలో జనాభా సంఖ్యను బట్టి 3 నుంచి 4 వరకు సచివాలయాలను ఏర్పాటు చేసిన గత వైసీపీ ప్రభుత్వం ఎడాపెడా గ్రేడ్-3 ఏఎన్ ఎంలను నియమించిందనే ఆరోపణలు ఉన్నాయి. తాజాగా గ్రేడ్-3 ఏఎన్ఎంలకు ఎంపీ హెచ్ఏ పదోన్నతులు ఇచ్చేందుకు తాత్కాలిక సీనియార్టీ జాబితాలను సిద్ధం చేయాల్సిందిగా మౌఖిక ఆదేశాలు జారీ కావడంతో క్షేత్రస్థాయిలో ఏఎన్ఎంల హేతుబద్ధీకరణ (రేషనలైజేషన్) ఆవశ్యకతను గుర్తు చేస్తోంది. ఇప్పటికే సచివాల యాల్లో విధులు నిర్వర్తిస్తున్న గ్రేడ్-3 ఏఎన్ ఎంలు సంబంధిత ఆరోగ్య ఉపకేంద్రాల్లో విధులు నిర్వర్తించేలా కొద్దిరోజుల క్రితం ప్రభుత్వం ఉత్త ర్వులు ఇచ్చింది. అవే సచివాలయాల్లో ఇంత వరకు డిప్యూటేషన్లపై విధులు నిర్వర్తిస్తున్న ఆరోగ్య ఉపకేంద్రాల ఎంపీహెచ్ఏలను వెనక్కి పంపేందుకు ఇప్పటికీ ఉత్తర్వులు వెలువడ లేదు. ఒకవేళ ఉత్తర్వులు విడుదలైనా పలు ఆరోగ్య ఉపకేంద్రాల్లో రెగ్యులర్ ఏఎన్ఎం, సెకండ్ ఏఎన్ఎంతో పాటు కొత్తగా గ్రేడ్-3 ఏఎన్ఎం విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని ఆరోగ్య ఉపకేంద్రాల్లో గరి ష్ఠంగా ఐదుగురు ఏఎన్ఎంలు ఉన్నట్టు సమా చారం. జిల్లాలో 634 ఆరోగ్య ఉపకేంద్రాలు, సుమారు 1400 సచివాలయాలు న్నాయి. కొత్తగా ఎంపీహెచ్ఏ పదోన్నతులు ఇవ్వనున్న నేప థ్యంలో క్షేత్రస్థాయిలో ఆరోగ్య ఉపకేంద్రాలు, సచివాలయాలకు కేటాయించిన ఏఎన్ఎంలు, ఎంపీహెచ్ఏలు, సెకండ్ ఏఎన్ఎంల సంఖ్య, ఆవశ్యకతలపై హేతుబద్ధీకరణను వాస్తవ పరిస్థితులకనుగుణంగా జరిపిన తర్వాతే చేప ట్టడం వల్ల ప్రయోజనం ఉంటుందని తెలు స్తోంది. ప్రతీ ఆరోగ్య ఉప కేంద్రానికి కేటా యించిన మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్ హెచ్‌పీ)ల విషయంలోనూ ప్రక్షాళన /హేతు బద్ధీకరణ అవసరమని చెబుతున్నారు.



కృత్రిమ అవయవాలు అందజేస్తున్న వైద్యులు కృష్ణకిరణ్ తదితరులు

విర్డ్ ఆసుపత్రిలో ప్రత్యేక క్యాంపు

ద్వారకాతిరుమల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ద్వారకా తిరుమల విర్డ్ ఆసుపత్రిలో ప్రముఖ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్లు డాక్టర్ కృష్ణకిరణ్, డాక్టర్ నీల్‌శేత్‌ల ఆధ్వ ర్యంలో సోమవారం ప్రత్యేక క్యాంపు నిర్వ హించారు. 20 మందిని పరీక్షించి అందులో 8 మందికి తుంటి, మోకాలు శస్త్ర చికిత్సలను విజయ వంతంగా జరిపినట్లు విర్డ్ ఆసుపత్రి చైర్మన్ రాజా ఎస్‌వీ సుధాకరరావు తెలిపారు. గుప్తా ఫౌండేషన్ చైర్మన్ ఎంఎం గుప్తా సహకారంతో ప్రోస్తాసిస్ 3డి ప్రింట్‌తో తయారైన కృత్రిమ అవయవాలను 16 మంది దివ్యాంగులకు పంపిణీ చేశారు. వైద్యులు భవ్యచంద్, హమీద్, బాలాజీ విహారి, పీవీ నాగేంద్రబాబు, సింధు, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

కారులో నిద్రపోతున్న మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

ఏలూరు క్రైం, అక్టోబరు 14 : కారులో నిద్రపోతున్న ఒక మహిళ మెడలోని బంగారు ఆభరణాలు అపహరణకు గుర య్యాయని ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేశారు. శ్రీకాకుళం జిల్లా పురుషోత్తపురానికి చెందిన తవిటి నాయుడు కుటుంబ సభ్యులు విజ యవాడ కనకదుర్గ దర్శనం చేసుకుని ఆది వారం అర్ధరాత్రి బయలుదేరారు. ఏలూరు మెయిన్ బైపాస్ రత్నాస్ హోటల్ వద్దకు వచ్చేసరికి డ్రైవర్‌కు నిద్రరావడంతో రత్నాస్ హోటల్ పక్కన సర్వీసు రోడ్డులో కారు ఆపి అందరూ పడుకున్నారు. డ్రైవర్ దగ్గర ఉన్న అద్దాన్ని దించి ఉంచారు. గుర్తు తెలియని దొంగలు అక్కడకు వచ్చి దించి ఉంచిన అద్దం నుంచి మిగిలిన డోర్స్ లాక్ తీసి వెనుక సీటులో పడుకున్న మహిళ మెడలోని రెండున్నర కాసుల బంగారపు గొలుసును కట్ చేసుకుని వెళ్లిపోయారు. సంఘటనపై ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూరల్ ఎస్‌ఐ దుర్గా ప్రసాద్ సోమవారం కేసు నమోదు చేశారు.

క్రైమ్ కార్నర్

వ్యాన్ ఢీకొని యువకుడి మృతి

వేలేరుపాడు, అక్టోబరు 14: వ్యాన్ ఢీకొని వేలేరుపాడు మండలం రుద్రమ్మకోట గ్రామా నికి చెందిన గాదే అనీల్‌కుమార్ అనే యువకుడు మృతి చెందాడు. అనీల్‌కుమార్ (35) రుద్రమ్మ కోట నుంచి భద్రాచలం వైపు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా ఎటపాక మండలం గన్నవరం గ్రామం వద్ద వెనుక నుంచి గ్యాస్ సిలిండర్లతో వెళ్తున్న వ్యాన్ ఢీకొనడంతో అనీల్‌కుమార్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మరణించాడు. ఎటపాక పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. అనిల్ కుమార్‌కు భార్య, ఇద్దరు చిన్నారులు ఉన్నారు.

మందలించారని మనస్థాపంతో ఆత్మహత్య

భీమడోలు, అక్టోబరు 14 : మద్యానికి బానిసై కుటుంబ సభ్యులతో గొడవపడి గడ్డిమందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. భీమడోలు మండలం గుండుగొలను గ్రామానికి చెందిన బోడా కుమార్‌రాజా (45) కూలి పనులు చేస్తూ జీవిస్తుంటాడు. తనకు వివాహం కాగా. కుమా రులు ఇద్దరు ఉన్నారు. అయితే రోజూ మద్యం సేవించి కుటుంబ సభ్యులతో గొడవపడు తుం టాడు. ఈ నేపథ్యంలో 13వ తేదీ మద్యం సేవించి ఇంట్లో కుటుంబ సభ్యులతో గొడవ పడ్డాడు. కుటుంబ సభ్యులు అతనిని మందలించడంతో మనస్థాపానికి గురై స్థానిక అంబేద్కర్ విగ్రహం సమీపంలో గడ్డిమందు తాగి అపస్మారక స్థితికి వెళ్ళాడు. అతని సోదరుడు రాజేంద్ర కుమార్ ఇంట్లో వారికి ఫోన్‌చేసి ఏలూరు ప్రభుత్వాసు పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా సోమవారం ఉదయం 5 గంటల సమయంలో మృతి చెందాడు. మృతుడి కుమారుడు అర్జున్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ కొనలేదని యువకుడి బలవన్మరణం

టి.నరసాపురం, అక్టోబరు 14: కలుపుమందు తాగి యువకుడు పిన్నిబోయిన పృథ్వి (23)మృతి చెందాడు. తెడ్లెం గ్రామానికి చెందిన పిన్నిబోయిన సుబ్బారావు రెండో కుమారుడు పృథ్వి రెండు సంవత్సరాలుగా స్థానికంగా పురుగులమందు షాపులో పని చేస్తున్నాడు. రెండు నెలలుగా తండ్రిని స్పోర్ట్స్ బైక్ కొనమని అడుగుతుండగా అప్పులు ఉన్నాయని తీరాక కొంటానని చెబు తుండటంతో మనస్థాపానికి గురైన యువకుడు ఈనెల 12న రాత్రి కలుపు మందు తాగి ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. అతనిని చింతలపూడి ఆసుపత్రికి తరలించగా అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ఏలూరు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ జయరాజు తెలిపారు.

మనస్థాపంతో వృద్ధురాలి ఆత్మహత్య

భీమవరం క్రైం, అక్టోబరు 14 : ఒకపక్క అనా రోగ్యం, మరోపక్క కుమార్తెకు, కుమారుడికి వివాహం కావట్లేదనే మనస్తాపంతో వృద్ధురాలు చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. భీమ వరం వన్‌టౌన్ హెచ్‌సీ చక్రవర్తి తెలిపిన వివ రాలు ప్రకారం గునుపూడికి చెందిన కోన సీతామ హాలక్ష్మి (62) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. దానికి తోడు ఇద్దరు పిల్లలకు వివాహం కావట్లేదనే బెంగ కూడా ఉంది. కుమా రుడు మురళీకృష్ణ సోమవారం ఉదయం లేచేస రికి తల్లి కనిపించలేదు. చుట్టుపక్కల వెతుకుతుం డగా అటుగా వెళుతున్న వ్యక్తి ఎవరో మహిళ మృతదేహం సోమగుండం చెరువులో తేలుతుం దని చెప్పడంతో వెళ్ళి చూడగా తన తల్లి మృత దేహంగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ చక్రవర్తి తెలిపారు.



కారు ఢీకొని భర్త మృతి, భార్యకు గాయాలు

ఉంగుటూరు, అక్టోబరు 14 : జాతీయ రహదారిపై బాదంపూడి వైజంక్షన్ వద్ద సోమ వారం రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెందగా భార్యకు తీవ్రగాయాలయ్యాయి ఉంగుటూరు మండలం బొమ్మిడి గ్రామానికి చెందిన యర్రా పెద్దిరాజు, భార్య నాగమణితో కలిసి మోపెడ్‌పై ఉంగుటూరు వెళ్లారు. తిరిగి బొమ్మిడి వెళుతున్న సమయంలో బాదంపూడి వై జంక్షన్ వద్ద రావుల పాలెం నుంచి హైదరాబాదు వెళ్తున్న కారు ఢీకొంది. దీంతో యర్రా పెద్దిరాజు (60) అక్కడి కక్కడే మృతి చెందగా, భార్య నాగమణికి తీవ్ర గాయాలయ్యాయి. నాగమణిని హైవే అంబు లెన్స్‌లో తాడేపల్లిగూడెం ఏరియా అసుపత్రికి తరలించారు. చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

భీమవరం క్రైం, అక్టోబరు 14 : (ఆంధ్రజ్యోతి) ద్విచక్ర వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. భీమ వరం రూరల్ హెచ్‌సీ మహేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కొవ్వాడ గ్రామా నికి చెందిన మేడపాటి చంద్రలీల (50) కూలి పనులకు వెళుతూ జీవనం సాగిస్తున్నది. ఈనెల 10న కూడా కూలి పనులకు వెళుతుండగా అదే గ్రామానికి చెందిన వింజరపు వెంకట పవన్‌కు మార్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంతో చంద్రలీ లను ఢీకొట్టాడు. ఆమెకు తీవ్ర గాయాలు కాగా ఆసుపత్రి తలరించారు. మరుసటి రోజు పోలీ సులు కేసు నమోదు చేశారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి ఆమె మృతి చెందినట్లు పోలీ సులు తెలిపారు. ప్రభుత్వాసుపత్రిలో పోస్టు మార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

కొట్లాటపై ఇరు వర్గాలపై కేసు నమోదు

పాలకోడేరు, అక్టోబరు 14: సరిహద్దు తగాదా విషయమై కొట్లాట జరిగిన సంఘటనపై ఇరు వర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు పాలకోడేరు హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తెలిపారు. పెన్నాడపాలెంకు చెందిన బొర్రా రమేష్ తల్లికి బాగోగకపోవడంతో ఆసుపత్రికి ఆటో పై తీసుకెళ్ళేందుకు సిద్ధపడ్డాడు. అయితే సరిహద్దులో ఉన్న ఆరేపల్లి వెంకటేశ్వరరావు సరిహద్దులో ఉన్న పోల్స్ అడ్డుగా ఉండటంతో బొర్రా రమేష్, బొర్రా చంద్రరావు, బొర్రా ప్రసన్నలు వాటిని తొలగించారు. ఆరేపల్లి వెంకటేశ్వరరావు పోల్స్‌ను ఎలా తొలగిస్తారని అడ్డువెళ్ళారు. మాటమాట పెరిగి ఆరేపల్లి వెంకటేశ్వరరావు రమేష్, చంద్రరావుపై చాకుతో దాడి చేశాడు. దీంతో వారికి గాయాలు కావడంతో ఆసుపత్రి నుంచి వచ్చిన నివేదిక ఆధారంగా బొర్రా రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరేపల్లి వెంకటేశ్వరరావుపై కేసు నమోదు చేశామన్నారు. ఇదే కేసులో ఆరేపల్లి వెంకటేశ్వరరావును చంపుతామని బెదిరించడంతో వెంకటేశ్వరరావు పురుగుల మందు తాగి ఆసుపత్రిపాలయ్యాడు. ఈ కేసులో వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదుపై బోర్రా రమేష్, బోర్రా చంద్రరావు, బొర్రా ప్రసన్నల పై కేసు నమోదు చేశామని హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు.





బోల్తా పడిన ఆర్టీసీ బస్సు... ప్రమాదంలో మృతి చెందిన విమలాబాయి

ఆర్టీసీ బస్సు బోల్తా ..ఒకరి మృతి

17 మందికి గాయాలు



చింతలపూడి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లా చింతలపూడి మండలం డి.ఎస్ రావుపేట సమీపంలో హైదరాబాదు నుండి చింతలపూడి మీదుగా ఏలూరు వెళ్ళే సూపర్ లగ్జరీ ఏలూరు డిపోకు చెందిన ఆర్టీసి బస్సు అదుపు తప్పి సోమవారం తెల్లవారు జామున బోల్తా పడింది. బస్సులో 36 మంది ప్రయా ణిస్తున్నారు. ఇందులో ఏలూరుకు చెందిన పెందుర్తి విమలాబాయి (74) మృతి చెందగా మరో 17 మందికి గాయాలయ్యాయి. క్షత గాత్రు లను చింతలపూడి ఏరియా ఆసుపత్రికి తర లించారు. స్వల్పగాయాలైన 13 మందికి చికిత్స చేశారు. కాగిత స్వరూప, పెందుర్తి సియోను, కుమారి, ఎం.రిషిత, గాలంకి శిరీష లకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స జరిపి ఏలూరు తరలించారు. మరో పది నిమిషాల్లో బస్సు చింత లపూడి సెంటర్‌కు చేరుతుందనగా డి.ఎస్. రావుపేట దాటిన తరువాత మలుపు తిరుగుతూ వేగంగా బస్సు అదుపు తప్పడంతో బోల్తా పడి కొంత దూరం దూసుకుపోయింది. ఈ మార్గం లోనే వెనుక వస్తున్న ఆర్టీసి బస్సు ప్రమాదాన్ని చూసి బోల్తా పడిన బస్సు వెనుకవైపు అద్దాలు పగులకొట్టి క్షతగాత్రులు కొందరిని ఎక్కించుకుని మరికొందరిని ఆటోల్లో ఏరియా ఆసుపత్రికి తరలించారు. జీడిమెట్ల నుంచి ఈ సర్వీసు ఖమ్మం, సీతానగరం, చింతలపూడి మీదుగా ఏలూరు వెళ్ళాల్సి ఉంది. అయితే ఈ మార్గంలో రోడ్లు బాగోలేకపోవడంతో గత కొన్ని రోజులుగా సత్తుపల్లి, గురుభట్లగూడెం మీదుగా చింత లపూడి రాకపోకలు సాగిస్తున్నాయి. బస్సు మలు పులో ఎడమవైపుకు అదుపు తప్పి బోల్తా పడి కొద్ది దూరం ఈడ్చుకుపోయిందని ప్రయాణి కులు చెబుతున్నారు.

పది నిమిషాల్లో గమ్యం..

బస్సు బోల్తా ప్రమాదంలో గాయపడిన వారిలో నలుగురు ఒకే కుటుంబానికి చెందిన వారు.దసరా సెలవులు కావడంతో నాలుగురోజుల క్రితం పెందుర్తి విమలాబాయి, ఆమె ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు పిల్లలు హైదరా బాదులో బంధువుల ఇళ్ళకు వెళ్ళారు. సెలవులు పూర్తికావడంతో తిరిగి వస్తూ ఈ ప్రమాదానికి గురయ్యారు. ఇందులో మృతురాలి కూతురైన స్వర్ణలత చింతలపూడి ప్రభుత్వ జూని యర్ కళాశాల విద్యార్థినుల సంక్షేమ హాస్టల్ వార్డెన్‌గా పనిచేస్తున్నారు. వీరంతా ఒకే బస్సు ఎక్కారు. స్వర్ణలత చింతలపూడిలో దిగిపోతుంది, తామంతా ఏలూరుకు చేరుకోవచ్చని బస్సులో ప్రయాణించారు. పది నిమిషాల్లో చింతలపూడి వస్తుందనగా ముగ్గురు కుమార్తెలు లగేజీలు తీసుకోవడానికి సిద్ధమవుతుండగా ప్రమాదం జరిగి విషాదాన్ని నింపింది.

ఏలూరు-చింతలపూడి మీదుగా..

హైదరాబాదుకు ఆరు ఆర్టీసీ సర్వీసులు, రెండు ప్రైవేటు స్లీపర్ సర్వీసులు నడుస్తు న్నాయి. 25 సంవత్సరాల్లో ఎన్నడూ ఇటువంటి ప్రమాదం ఈ ప్రాంతంలో హైదరాబాదు వెళ్ళే సర్వీసులో తాము చూడలేదని స్థానికులు చెబుతున్నారు. ఏలూరు నుంచి చింతలపూడి మీదుగా వెళ్లే బస్సులు కూడా గ్రామీణ ప్రాంతా లను టచ్ చేసుకుంటూ చింతలపూడి చేరుకుని వెళ్తుంటాయి. దీంతో నేరుగా ఆయా గ్రామాల్లో ప్రయాణికులు దిగుతుంటారు. ఈ ప్రమాదం చూసి పలువురు ఉలిక్కిపడ్డారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర మాట్లాడుతూ బస్సువేగంగా వెళ్తూ మలుపు తిరిగిన సమయంలో అదుపు తప్పడంతో ప్రమాదానికి గురైందని చెప్పారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించామని చెప్పారు. చింతలపూడి ఎమ్మెల్యేసొంగా రోషన్‌కుమార్ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు.

రుద్రాభిషేకం



పాలకొల్లు అర్బన్, అక్టోబరు, 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచారామ క్షేత్రం శ్రీక్షీరా రామలింగేశ్వర స్వామికి సోమవారం ఉదయం ఏకవార, రుద్రాభిషేకాలు సాయంత్రం పంచ హారతులు ఇచ్చి ప్రత్యేకంగా అలంకరించారు. ఈవో ముచ్చర్ల శ్రీనివాస రావు, అర్చకులు, సిబ్బంది భక్తులు పాల్గొన్నారు. అదే విధంగా కోడిగట్టున ఉన్న శంకర మఠంలో అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరునికి, 24వ వార్డు శంభన్న అగ్రహారంలోని శంభేశ్వర స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు.పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

గ్రామోత్సవం



పెనుగొండ, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా పెనుగొండ, సిద్ధాంతం గ్రామాల్లో కనకదుర్గమ్మ ప్రతిమలకు అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించి సోమవారం పలు సంస్కృతిక కార్యక్రమాలు, బ్యాండ్ మేళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఘటాల దిబ్బ జై దుర్గా భవాని యూత్ ఆధ్వర్యంలో కనక దుర్గమ్మకు గ్రామోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. డీజే సౌండ్ సిస్టంలతో తీన్మార్ డప్పులతో వేడుకగా గ్రామోత్సవం సాగింది.

మళ్లీ ముసురు

(5వ పేజీ తరువాయి)

ఎకరాల సాగు తాడేపల్లిగూడెం, తణుకు, అత్తిలి, గణపవరం, పెంటపాడు, పెనుగొండ మండలాల్లో ఈనిక, పాలుపోసుకునే దశలలో ఉంది. ఈ దశలో ఉన్న పంట చేలకు భారీ వర్షాలు పడితే నష్టం ఎక్కువ ఏర్పడుతుంది. వర్షంతో వరి చేను పూర్తిగా నేలకు వాలే ప్రమాదం ఉంది. అందువలన వర్షాలు కురవడం రైతులను ఒత్తిడికి గురిచేస్తుంది. నాలుగు రోజులు వర్షాలలో ఎప్పుడు నష్టం చేకూరుతుందనే ఆలోచన రైతులలో నెలకొంది. గట్టెక్కిస్తుందా ముంచేస్తుందో వాతావరణం మీదే ఆధారపడి ఉంది. వెనకస్తు సాగు 95వేల ఎకరాలు ఉంది. ఈసాగుకు అధిక వర్షాలు కురిస్తే వరి చేలల్లో నీరు పెరిగి తెగుళ్ళ వ్యాప్తి చెందే అవకాశం ఉంది. పొడతెగులు, ఆకుముడత, కంకి ఉచపోటులు వస్తాయి. ఈ విధంగాను నష్టం ఏర్పడుతుంది. మొత్తం సార్వా సాగుకు అల్పపీడనం వలన నష్టమేనని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది సార్వా సాగు ఆది నుంచి వరుణ దేవుడు రైతులను కష్టాలు పెడుతూనే ఉన్నాడు. 30వేల ఎకరాల నాట్లు ముంపు బారిన పడ్డాయి. 8వేల ఎకరాల నాట్లుయితే పూర్తిస్థాయిలో దెబ్బతిన్నాయి. ఇప్పుడు మరోసారి ఎంత నష్టం చేస్తుందో గండం దాటక కాని తెలియదు.

తమ్ముళ్లకు చుక్కెదురు

(5వ పేజీ తరువాయి)

చేసుకున్నారు. సదరు సిండికేట్‌కు ఒక్క షాపు మాత్రమే వరించింది. దాంతో వారంతా ఖంగు తిన్నారు. ఇప్పటిదాకా మద్యం వ్యాపారం జోలికి వెళ్లలేదు. తొలిసారి మద్యం వ్యాపారంలో ప్రవేశించి షాక్ తిన్నారు. అయితే తాడేపల్లిగూడెం స్టేషన్ పరిధిలో కూటమి సిండికేట్‌లకే అధిక షాపులు లభించాయి. అందులో కొన్ని సిండికేట్‌లకు చుక్కెదురైంది.

370 దరఖాస్తులు... 17 షాపుల

గతంలో వైసీపీ తరఫున ఉండి నియోజకవర్గంలో సర్పంచ్‌గా ఎన్నికైన నాయకుడు గడచిన ఎన్నికల ముందు తెలుగుదేశంలో చేరారు. మద్యం వ్యాపారంలో అతనికి అనుభవం ఉంది. బార్‌లు కూడా నిర్వహిస్తున్నారు. అతని సిండికేట్ ఏకంగా 370 దరఖాస్తులు చేసింది. ఏకంగా రూ.7.40 కోట్లు చెల్లించారు. లాటరీలో సదరు సిండికేట్ 17 షాపులు పొందగలిగారు. భీమవరం పట్టణంలోనే ఏడు షాపులు లభించడంతో వారికి కాస్త ఊరట లభించింది. తణుకు నియోజకవర్గంలో కూటమి శ్రేణులకు గట్టి దెబ్బే తగిలింది. అత్తిలి మండలం. తణుకు పరిధిలో వైసీసీ సిండికేట్‌లదే పైచేయిగా నిలిచింది. దాదాపు కీలకమైన షాపులన్నీ వైసీపీ సానుభూతిపరుల వశమయ్యాయి.

పాలకొల్లులో అంతా ఒక్కటై

పాలకొల్లు స్టేషన్ పరిధిలో దరఖాస్తులు చేయడానికి అంతా పోటీ పడ్డారు. పాలకొల్లు పరిధిలో 19 షాపులు మాత్రమే ఉన్నాయి. అక్కడ ఏకంగా 873 దరఖాస్తులు పడ్డాయి. పోటీపడీ అంతా దరఖాస్తులు చేసేశారు. పెద్దమొత్తంలో సొమ్ములు చెల్లించాల్సి వచ్చింది. కోట్ల రూపాయలు చెల్లించి దరఖాస్తులు చేసుకుని ఊపిరి బిగబట్టి చూశారు. షాపులు దక్కిన తర్వాత అంతా ఒక్కటయ్యారు. అన్ని సిండికేట్‌లకు భాగస్వామ్యం ఉండేలా చర్చలు జరిపారు. దాంతో ప్రతి ఒక్కరూ ఊరట పొందినట్టయ్యింది. లాటరీ ప్రక్రియ సజావుగా సాగేలా జిల్లా అధికార యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకుంది.

ఎక్కువగా సిండికేట్ల మయం

175 దుకాణాలకు 5627 దరఖాస్తులు అందాయి. ఎక్కువగా సిండికేట్లుగా దరఖాస్తులు చేశారు. ఒక్కో దుకాణానికి 10 నుంచి 15 మంది కలిసి దరఖాస్తు చేసి ఏ నెంబర్ వచ్చినా అందరికి దుకాణం దక్కేలా ముందుగా మాట్లాడుకుని ముందుకెళ్ళారు. కొందరు సిండికేట్‌లో లేకుండా 30 నుంచి 60 వరకు ఒక్కరే దరఖాస్తు చేసుకోగా వారికి ఒక్క దుకాణం కూడా దక్కలేదనే ప్రచారం కూడా జరుగుతున్నది. భీమవరం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గతంలో భారీగా మద్యం వ్యాపారం చేసిన ముగ్గురు సిండికెట్‌గా మారి ఎక్కువ దుకాణాలు దక్కించుకున్నట్లుగా సమాచారం. సుమారు 10 మంది మహిళలు కూడా దుకాణాలు దక్కించుకున్నారు. మేమేం తక్కువ కాదు అన్నట్లుగా వారు కూడా సోమవారం జరిగిన లాటరీ వద్దకు చేరుకుని లాటరీ పద్ధతిని వీక్షించారు.

లైసెన్స్ ఫీజు చెల్లించడానికి భారీగా క్యూ

దుకాణాలు దక్కించుకున్న వారు వెంటనే వారు అక్కడే ఎస్‌బీఐ బ్యాంక్ వారు ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో డబ్బు చెల్లించేందుకు క్యూ కట్టారు. కొందరు డబ్బు, మరికొందరు ఆన్‌లైన్ ద్వారా నగదు చెల్లించారు. దీంతో ఆ ప్రాంతం అంతా డబ్బు కట్టలతో కళకళలాడింది. లైసెన్స్ ఫీజులో ఆరవ వంతుగా రూ.19 కోట్ల 25 లక్షలు జమ అయినట్లుగా జిల్లా కలెక్టర్ నాగరాణి తెలిపారు. లాటరీ ప్రక్రియ అంతా పారదర్శకంగా, లైవ్ వీడియో ద్వారా జరిగిందని ఎవ్వరికీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా జరిగిందని ఆమె తెలిపారు.







నరసాపురం మండలంలో కూలిన చెట్లను తొలగిస్తున్న కార్మికులు.. ఉండి కోంద్రుతుపేటలో వర్షానికి రహదారిపై నిలిచిన నీరు, బ్రాహ్మణచెరువు రోడ్డుపై పడిపోయిన చెట్టును తొలగిస్తున్న జనసైనికులు

అన్నదాతల బెంబేలు

వాతావరణంలో మార్పులతో ఆందోళన

విద్యుత్ శాఖ కంట్రోల్ రూం ఏర్పాటు

పెనుగొండ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తుపాను భయంతో రైతులు బెంబేలెత్తుతున్నారు. రెండు రోజులుగా వాతావరణంలో మార్పులు, ఆకాశం మేఘావృతమై వర్షాలు కురుస్తున్నాయి. దీనికి తోడు అల్పపీడన ప్రభావంతో రానున్న మూడు, నాలుగు రోజుల్లో మరిన్ని వర్షాలు, ఈదురు గాలులు వీస్తాయని వార్తలు వస్తుండడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఒక వైపు వరి కోతలు జరుగుతుండగా మరో వైపు ఈదురు గాలులు వల్ల అరటి, పంట తోటలు దెబ్బతింటాయని వాపోతున్నారు.

● నరసాపురం రూరల్ : వాయుగుండం కారణంగా వీచిన బలమైన గాలులకు సీతారాంపురం- పేరుపాలెం రోడ్డులో సరుగుడు చెట్లు నేలకొరిగాయి. చెట్టు కొమ్ములు రోడ్డపై పడడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. చెట్లు పడే సమయంలో రహదారిపై ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. వెంటనే ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమై కూలిన చెట్లను పక్కకు తీయించారు. తుపానుకు విద్యుత్ వైర్ల తెగి రోడ్డుపై పడితే వెంటనే కంట్రోల్ రూంకు సమాచారం ఇవ్వాలని ఈపీడీసీఎల్ ఈఈ మధుకుమార్ చెప్పారు. ప్రజలకు నిరంతరం విద్యుత్ అందించేందుకు వీలుగా భీమవరంలో 94409 02926 నెంబర్‌తో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు.

● ఉండి : కురిసిన వర్షానికి రహదారి నిండుకుంది. ఉదయం నుంచి దఫదఫాలుగా కురుస్తున్న వర్షానికి రహదారులు వర్షపు నీటితో నిండుకున్నాయి. ఉండి కాపులపేటలోని సీసీ రహదారి, కోంద్రుతుపేట నుంచి జంగాల కాలనీకి వెళ్లే రహదారి వర్షపు నీటితో నిండుకుంది. ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

● పాలకొల్లు అర్బన్ : ఉదయం నుంచి పట్టణంలో ఆకాశం కారుమబ్బులతో చిమ్మచీకటిగా మారింది. రోజుంతా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రైనేజీలు పొంగి రోడ్లపైకి చేరడంతో రోడ్లు అన్ని బురదగా మారాయి. పాలకొల్లు రైల్వే స్టేషన్ నుంచి వీవర్స్ కాలనీ మీదుగా పట్టణంలోని చేరుకునే రోడ్డు ఛిద్రమైంది. పట్టణంలోని లాకుల నుంచి పూలపల్లి సెంటర్ వరకూ రోడ్డు పూర్తిగా పాడైపోయి గోతుల మయంగా మారింది. పల్లె పండుగ మాదిరిగా పట్టణాలలో కూడా పండుగ వాతావరణం కల్పించే విధంగా రోడ్లను బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

● తణుకు : రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమై ఉండటంతో వరి చేలకు తెగుళ్ళ వ్యాప్తి చెందుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా వరి పంటకు కీటక బెడద ఉంటుందంటున్నారు. చిరు వ్యాపారులు వ్యాపారాలు లేక ఇబ్బందులు పడుతున్నారు.

● పెనుమంత్ర : ఈదురు గాలులతో కూడిన భారీ వర్షానికి బ్రాహ్మణ చెరువు వీరవాసరం రహదారిపై ఉన్న చెట్టు విరిగిపడింది జనసైనికులు నేలకొరిగిన చెట్లను పక్కకు తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు. రానున్న 48 గంటల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురుస్తుందని వాతావరణ హెచ్చరిక నేపథ్యంలో పొట్ట దశలో ఉన్న వరి పొలాలు అధిక వర్షాలు కారణంగా దిగుబడి తగ్గి నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా అమ్మవార్ల నిమజ్జనోత్సవం





పాలకొల్లు, మొగల్తూరులో అమ్మవారి నిమజ్జన ఊరేగింపు

భీమవరం టౌన్/ఆచంట/మొగల్తూరు/ఉండి/పాలకొల్లు అర్బన్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ వార్ల నిమజ్జన కార్యక్రమాలు సోమవారం కూడా జరిగాయి. మొగల్తూరు గాంధీబొమ్మల సెంటర్ లో రెండు ప్రాంతాల్లో నిలబెట్టిన అమ్మవార్లను ఊరేగించిన సమయంలో తీన్ మార్ వాయిద్యాల విషయంలో రెండు వర్గాలు తోపులాట చేసుకున్నారు. ఈతోపులాటతో సుమారు 30 నిమిషాలు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఉండి మండలం వెలివర్రులోని శ్రీవీరపేరంటాలమ్మను ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు రమాదేవి దంపతులు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఎం.రంగ రాజు, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి పి.వెంకటేశ్వర రాజు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు సిద్ధరాజు, ఉప సర్పంచ్ ఎం.శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షల మేరకు పని చేయాలి

పెనుమంత్ర, అక్టోబరు 14 : ప్రజల ఆకాంక్షలు మేరకు ప్రజాప్రతినిధులు పని చేయాలని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. మండలం ప్రజా పరిషత్ సర్వసభ సమావేశానికి సోమవారం హాజరైన ఎమ్మెల్యే పితాని మాట్లాడుతూ పని చేయని అధికారులు బదిలీపై వెళ్లవచ్చునని సూచించారు. ప్రజలకు తాగునీరు రోడ్లు డ్రైనేజీ పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వివిధ శాఖల అధికారులతో సమీక్షించిన ఎమ్మెల్యే పితాని విద్యుత్ శాఖ అధికారుల తీరుపై మండిపడ్డారు లో వోల్టేజ్ సమస్యలు అన్ని గ్రామాల్లో ఉన్నాయని తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. రానున్న రెండేళ్లలో ఆర్ అండ్ బీ రోడ్ల నిర్మాణా నికి గోదావరిపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.600 కోట్ల పనులకు ముఖ్యమంత్రి సూత్రధాయంగా అంగీకరించారని చెప్పారు. మండల పరిషత్ అధ్యక్షుడు కర్రి వెంకటనారాయణ రెడ్డి వైస్ ఎంపీపీలు ఈద్ అనిత, వాసంశెట్టి కిరణ్, ఇన్చార్జి ఎంపీడీవో విశ్వేశ్వరరావు, వివిధ శాఖ అధికారులు ఎంపీటీసీలు సర్పంచులు పాల్గొన్నారు. అనంతరం పితాని సత్యనారాయణ మండల పరిషత్ సభ్యులు ఎంపీపీ కర్రీ వెంకటనారాయణ రెడ్డి శాలువ కప్పి బొకేతో సత్కరించారు.

ఓటర్లుగా నమోదు కావాలి

తణుకు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రులంతా ఓటర్లగా నమోదు కావాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల సమయాత్త సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడుతూ నవంబరు ఆరో తేదీ లోగా ఓటర్ల నమోదుకు కూటమి శ్రేణులు కృషి చేయాలన్నారు. ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రాడ్యుయేట్ ఎన్నికలకు సంబంధించి ఐదు స్థానాల్లో 3 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో టీడీపీ అధికారంలో లేకున్నా 3 స్థానాలు గెలుచుకుందని చెప్పారు. ఎమ్మెల్సీ చిరంజీవి రావు ప్రసంగించారు.

తెగిపడిన వైర్లు తాకవద్దు

భీమవరం టౌన్, అక్టోబరు 14: భారీ వర్షాలు నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజనీర్ ఎ.రఘునాథ్ బాబు ఆదేశించారు. వర్షాల కారణంగా తెగిపడిన విద్యుత్ వైర్లను గాని, తడిసిన విద్యుత్ స్తంభాలను గాని, విద్యుత్ వైర్ల పై తెగిపడిన చెట్ల కొమ్మలను గాని ప్రజలు నేరుగా తాకవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. వీలైనంత వరకు రబ్బరు చెప్పులను ధరించడం శ్రేయస్కరమన్నారు. వర్షాలు కారణంగా ఏదైనా విద్యుత్ అంతరాయం లేదా సమస్య తలెత్తితే దగ్గరలో గల విద్యుత్ సెక్షన్ ఆఫీసునకు గాని, టోల్ ఫ్రీ నంబరు 1912కు గాని కంట్రోల్ రూమ్‌నకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

పాలకొల్లు, అక్టోబరు 14 : (ఆంధ్రజ్యోతి) : పట్టణ తెలికుల సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక సోమవారం చిప్పాడ మోహనరావు కార్యాలయంలో జరిగింది. సంఘ గౌరవాధ్యక్షుడు మోహనరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా ధర్మవరపు అశోక్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా చోడవరపు ఉమామహేశ్వరరావు, కార్యదర్శిగా చిప్పాడ శ్రీను, కోశాధికారిగా మురపాక బాలాజీ, కార్యవర్గ సభ్యులు ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు.

వైద్య శాఖకు బదలాయించాలి

భీమవరం టౌన్, అక్టోబరు 14 : గ్రామ వార్డు హెల్త్ సెక్రటరీలను వైద్య ఆరోగ్య శాఖకు బదలాయించాలని, సీనియార్టీ లిస్టు తయారు చేసి పదోన్నతులు కల్పించాలని, జీవో 152,101,115 లను సక్రమంగా అమలు చేయాలని, తదితర డిమాండ్స్‌ని పరిష్కరించాలని కోరుతూ ఏపీ యునైటెడ్ విలేజ్ అండ్ వార్డు, హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది, రాష్ట్ర సంఘం పిలుపు మేరకు జిల్లా కలెక్టర్‌కు సోమవారం సామూహిక వినతి పత్రాన్ని అందించారు. జిల్లా అధ్యక్షురాలు ఆర్.భాగ్యలక్ష్మి, టి సరళ ప్రకాష్, పి.నాగమణి, ఎం.సుధారాణి, ఎస్ భారతి, డి.ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

తపాల శాఖ వారోత్సవాలు

భీమవరం టౌన్, అక్టోబరు 14 : బ్రిటిష్ కాలంలోనే తొలి తపాల స్టాంప్ విడుదలైందని భీమవరం పోస్టల్ శాఖ అసిస్టెంట్ డివిజనల్ సూపరింటెండెంట్ అల్లు సురేష్ అన్నారు. భీమవరం పోస్టల్ శాఖ, శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తపాల శాఖ వారోత్సవాల్లో భాగంగా స్టాంపులు, నాణాల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ 15న భారత తపాల శాఖ విధి విధానాలపై వ్యాస రచన, పర్యావరణంపై డ్రాయింగ్ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎ.సుబ్రమణ్యం, హెడ్ పోస్టు మాస్టర్ పి.రాజు, వీఆర్ ఓ సత్యనారాయణ, యూనియన్ లీడర్ లెనిన్ బాబు, బార్లోలి స్కూల్ ప్రిన్సిపాల్ అడపా సత్యవతి పాల్గొన్నారు.

సీపీఎం గ్రామసభ

గణపవరం, అక్టోబరు 14: గత ప్రభుత్వం పేదలకు ఇళ్లస్థలాలు ఇచ్చినా ఎటువంటి మౌలిక సదుపాయాలు కల్పించలేదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జక్కంశెట్టి సత్యనారాయణ ఆరోపించారు. అప్పన్నపేట సీపీఎం గ్రామ 13వ మహాసభ సోమవారం పి.గోవింద్ అధ్యక్షతన జరిగింది. అప్పన్నపేట సీపీఎం నూతన కార్యదర్శిగా బి.ఎర్రి నాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.







అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఆచంటలో ఎమ్మెల్యే పితాని, పెదఅమిరంలో ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు, పెంటపాడులో ఎమ్మెల్యే బొలిశెట్టి

పల్లెల అభివృద్ధికే పల్లె పండుగ

ఆచంట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సిమెంటు రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీటి సౌకర్యం కల్పించేందుకే ప్రభుత్వం పల్లె పండుగ వారోత్సవాలు చేపట్టిందని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. ఆచంటలో సోమవారం ఎమ్మెల్యే పితాని పల్లె పండుగ కార్యక్రమాన్ని ప్రారంభించి ఉపాధి హామీ పథకం నిధులు రూ. కోటి 90 లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. పోరకాలనీలో రూ. కోటితో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీలు, నటరాజ్ థియేటర్ కాలనీలో సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణానికి రూ. 41 లక్షలు, మన్నెవారివీధిలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.19 లక్షలు, బొంతువారిపాలెంలో తాగునీటి పరిష్కారానికి రూ. 10 లక్షలు, మానేవారిపాలెంకు రూ.20 లక్షల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పితాని శంకుస్థాపనలు చేశారు. సర్పంచ్ కోట సరోజిని, జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి, తహసీల్దార్ ఎం.సోమేశ్వరరావు, ఎంపీడీవో స్వరాజ్ శ్రీకర్, కేతా మీరయ్య, బీరా నరసింహమూర్తి, అధికారులు, కూటమి సభ్యులు పాల్గొన్నారు.

● పెనుమంత్ర :మాముడూరులో చిట్టమట్లగరువు, గ్రామాల్లో రూ.39 లక్షలతో నిర్మించే సీసీ రోడ్లు డ్రైనేజీ నిర్మాణానికి భూ పూజ చేశారు. సర్పంచ్ గూడూరి దేవేంద్రుడు, వైస్ ఎంపీపీ వాసంశెట్టి కిరణ్, టిడిపి నాయకులు పాలసముద్రం గూడూరు మురళి, చిటికెన తాతారావు కర్రీ సుబ్బారెడ్డి సత్తి సత్యానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు





కేఎస్ గట్టులో ఎమ్మెల్యే ఆరిమిల్లి, కొణితివాడలో ఎమ్మెల్యే అంజిబాబు

● కాళ్ల : పల్లె పండుగ వారోత్సవాలలో భాగంగా కాళ్ల మండలం జక్కరం, పెదఅమిరం గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు భూమి పూజ చేశారు. ఆయా గ్రామాల్లో సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు, నాయకులు కఠారి వెంకట నరసింహరాజు, కోరా రామ్మూర్తి, ముదుండి రాజేష్, పెన్మెత్స సత్యనారాయణరాజు, మంతెన కోదండ రామరాజు, ఎంపీడీవో జి.స్వాతి, ఈవోపీఆర్డీ భాస్కరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ టి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి సిబ్బంది, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

● పెంటపాడు : పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా పెంటపాడు, ఆకుతీగపాడు గ్రామాల్లో ఆయా గ్రామ సర్పంచ్‌లు తాడేపల్లి సూర్యకళ, దాసం వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఎస్సీ కాలనీల్లో డ్రైనేజీల నిర్మాణాలకు శంకుస్థాపన, పెంటపాడు ఊరచెరువు వద్ద రేవుకు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ప్రారంభోత్సవం చేశారు. ఎంపీపీ దాసరి హైమవతి, కిలపర్తి వెంకట్రావు, పుల్లా బాబి, దాసరి అప్పన్న, బండారు వెంకట్రావు, కొవ్వూరి లక్ష్మణరెడ్డి, దాసరి కృష్ణవేణి, కసిరెడ్డి మధులత, నల్లమిల్లి చినగోపిరెడ్డి, దాసరి సతీష్‌కుమార్, బుద్దన ధనరాజు పాలూరి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ ఏడిద శ్రీనివాస్, ఎంపీడీవో బాలాజీ వెంకటరమణ పాల్గొన్నారు.

● అత్తిలి : కేఎస్‌గట్టు గ్రామంలో పల్లెపండుగ-గ్రామదర్శిని కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ప్రణాళిక రూపొందించడం కోసం గ్రామ దర్శిని కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. పల్లె పండుగ ద్వారా సీసీ రోడ్లు, డ్రైన్లు, మినీ గోకులాల నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. కేఎస్ గట్టులో రూ. 9.25 లక్షలతో సీసీ డ్రెయిన్, రూ. 4.60 లక్షలతో నిర్మించే రెండు మినీ గోకులాలకు, రూ. 2.75 లక్షలతో నిర్మించే అంతర్గత సీసీ రోడ్లకు ఆయన శంకుస్థాపన చేశారు. అత్తిలి ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు ఆనాల ఆదినారాయణ, కార్యదర్శి సత్యనారాయణ, ఎంపీడీవో శ్యాముల్, తహసీల్దార్ దశిక వంశీ, పంచాయతీరాజ్ ఏఈ చైతన్య బాబు, తాతపూడి మారుతీరావు, ఏపీవో ప్రసాద్ పాల్గొన్నారు.

● భీమవరం టౌన్ : పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా వీరవాసరం మండలంలోని గవరపాలెం, ఉత్తరపాలెం, నవుడూరు, కొణితివాడ గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) శంకుస్థాపనలు చేశారు. జడ్పీటీసీ జి.జయప్రకాష్ నాయుడు, ఎంపీపీ దుర్గ భవాని పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా పోటీ చేస్తా.. అవకాశం ఇవ్వండి

భీమవరం అర్బన్, అక్టోబరు 14 : ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎన్నికలలో పోటీచేసేందుకు తనకు అవకాశం కల్పించాలని టీడీపీ రాష్ట్ర యూత్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కోళ్ళ నాగబాబు (టీడీపీ పండు) టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజును, భీమవరం నియోజకవర్గ ఇన్‌చార్జి తోట సీతారామలక్ష్మిలను కలిసి వినతిపత్రం అందించారు. ఎన్నో ఏళ్ళుగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నానని తనను గుర్తించి ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీ చేసేందుకు అవకాశం కల్పించే విధంగా పార్టీ అధిష్టానానికి సిఫార్సు చేయాలని వారిని కోరానని నాగబాబు తెలిపారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయమం

భీమవరం టౌన్, అక్టోబరు 14 : నాయకుల పుట్టిన రోజు వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం అభినందనీయమని బిల్డర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు జి.శ్రీనివాస్, టి.బోగయ్య అన్నారు. ప్రభుత్వ మాజీ విప్, మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పుట్టిన రోజు సందర్భంగా శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రముఖ వ్యాపార వేత్త ఏటీవీ రమణ సౌజన్యంతో 32 మంది దివ్యంగులకు నూతన దుస్తులు, భోజనాలు అందించారు. నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి,ఎ.తులసి వెంకటరమణ, వై.మురళీ, పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

భీమవరం అర్బన్, అక్టోబరు 14 : మున్సిపల్ క్లాప్ డ్రైవర్‌ల సమస్యలను పరిష్కారించాలని ఏఐటీయసీ జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్ రంగారావు డిమాండ్ చేశారు. భీమవరం మున్సిపల్ కార్యాలయం వద్ద ఏఐటీయుసీ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ క్లాప్ డ్రైవర్స్ ధర్న నిర్వహించారు. మూడు నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు పరచి పీఎఫ్, ఈఎస్ఐ అమలుల చేసి, కనీస వేతనం రూ.18,500 ఇవ్వాలన్నారు. క్లీన్ అండ్ గ్రీన్ వాహనాల మర్మతులను ప్రభుత్వంమే భరించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కరించలేని పక్షంలో నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. నాయకులు కె.మల్లేశ్వరరావు, శివ, రమణ పాల్గొన్నారు.

రూ.పది నాణెంపై అవగాహన

భీమవరం టౌన్, అక్టోబరు 14 : రిజర్వ్ బ్యాంకు ఆదేశాల మేరకు భీమవరం యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా రీజనల్ ఆఫీస్ ఆధ్వర్యంలో సోమవారం రూ.10 నాణెంపై అవగాహన, పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ రీజనల్ హెడ్ సత్యనారాయణ మాట్లాడుతూ రూ.పది నాణెలు తప్పనిసరిగా మారకంలో తీసుకోవాలని సూచించారు. బ్యాంకు మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

పంట కాలువలో గడ్డి మందు పిచికారీ

కాళ్ళ, అక్టోబరు 14 : తన గ్రామానికి తాగునీరందించే పంట కాలువలో కాంట్రాక్టర్ గడ్డి మందు పిచికారీ చేయడంపై దొడ్డనపూడి గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు ఆరు వేల మంది జనాభాకు తాగునీరు అందించే ఈ పంట కాలువలో నిబంధనలకు విరుద్ధంగా సంబంధిత కాంట్రాక్టర్ విషపూరితమైన గడ్డి మందు కొట్టి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచినీటి చెరువులో నీరు నింపుతున్న సమయంలో వాసన రావడంతో పాటు కాలువలో నీరు నలుపు రంగులోకి మారడం తో అనుమానం వచ్చి కాలువ వెంబడి పరిశీలించి వెంటనే నిలుపుదల చేశామన్నారు. ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు. దీనిపై సంబంధిత ఏఈ పణిశంకర్‌ని ఫోన్‌లో వివరణ కోరడానికి ప్రయత్నింగా స్పందించలేదు.

225 మందికి కంటి పరీక్షలు



కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పులపర్తి

భీమవరం అర్బన్, అక్టోబరు 14 : శ్రీకృష్ణదేవ రాయ సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందయమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. సమితి కల్యాణ మండలపంలో ఉచిత కంటి వైద్య సహాయ కేంద్రం సోమవారం మేక్స్ విజన్ సూపర్ స్పెషాలిటి కంటి ఆసుపత్రి సహకారంతో ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసి ఎమ్మెల్యే అంజిబాబు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. సమితి అధ్యక్షకార్యదర్శులు కేవీ మహంకాళరావు, ఎం.పార్థసారథి మాట్లాడుతూ సుమారు 225 మంది కంటి పరీక్షలు చేశామని, వీరిలో 40 మందికి కటారాక్ట్ ఆపరేషన్స్ 120 మందికి కళ్లజోళ్లు ఉచితంగా అందజేశామన్నారు. సభ్యులు ఎస్.సత్యనారాయణ, ఎస్.వీరాస్వామి, బి.సురేష్‌కుమార్, సీహెచ్. రంగసాయి, తదితరులు పాల్గొన్నారు.